ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 5 అక్టోబరు 2024


అధ్వానంగా ఉన్న కంకర ఫ్యాక్టరీ లేఔట్ దారి



అధ్వానం.. సాగేదెలా నిర్మాణం..!

- పీలేరులో నత్తనడకన జగనన్న కాలనీలు
- 43 లేఔట్లలో 3559 ఇళ్లు మంజూరు
- వాటిలో సంపూర్ణంగా పూర్తయినవి కేవలం 777
- రోడ్లు, నీరు, మురుగునీటి కాలువులు లేక లబ్ధిదారుల అవస్థలు

"ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే మా లక్ష్యం.. అందుకే మా ప్రభుత్వంలో పేదల కోసం కాలనీలు కాదు.. ఏకంగా ఊర్లే కట్టిస్తున్నాం.." ఇదీ.. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ చిక్కటి చిరునవ్వుతో.. శిరస్సు వంచి.. చేతులు జోడించి.. ఇలా.. ఇలా.. ఇలా.. అంటూ చేతులు ఊపుతూ చేసిన వ్యాఖ్యలు. ఆయన ఏ టైంలో హామీ ఇచ్చారో కానీ ఏ కాలనీలు చూసినా అర్ధాంతరంగానే ఆగిపోవడంతో అనుకున్న లక్ష్యం చేరుకోలేకపోయారు. ఇచ్చే సెంటు స్థలం కొండలు.. గుట్టల్లో ఇచ్చి ఆహా.. ఓహో.. అనేలా ఆర్భాటాలు చేసుకున్నారు తప్ప.. పేదలకు ఉపయోగపడింది లేదు. అసలు ఊర్ల మాట దేవుడెరుగు.. ఆ కాలనీల్లో కనీస వసతులైన రోడ్లు, డ్రైనేజీ, నీటి సౌకర్యం లేక అధ్వాన స్థితిలో ఉన్నాయి. లబ్ధిదారులు ఎక్కడికక్కడే నిర్మాణాలను వదిలేయడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయింది.



దుండగులు ధ్వంసం చేసిన బోరు, స్టార్టరు

పీలేరు, అక్టోబరు 4: కాలనీ అంటే అది ఒక ప్రత్యేకమైన ప్రాంతం. ఏళ్లు గడిచేకొద్దీ అక్కడి జనాభా ఆధారంగా సౌకర్యాలు మెరుగుపడతాయన్న ఆశతో లబ్ధిదారులు అక్కడ ఇళ్లు నిర్మించుకుంటూ ఉంటారు. కాలానుగుణంగా ప్రభుత్వాలు కూడా ఆయా కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ఇతరత్రా సౌకర్యాలు కల్పిస్తూ ఉంటాయి. అయితే గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో అటువంటివి ఏమీ జరగకపోవడంతో పీలేరు మండలంలోని జగనన్న కాలనీల లబ్ధిదారులు అటువైపు కన్నెత్తి చూడడానికి కూడా ఆసక్తి చూపడం లేదు. అందుకు హౌసింగ్ శాఖ గణాంకాలే సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. గత ప్రభుత్వంలో పీలేరు మండల వ్యాప్తంగా 39 లేఔట్లు ఏర్పాటు చేసి వాటిలో సుమారు 12 వేల ఇళ్లు ఇవ్వొచ్చని గుర్తించిన అధికారులు, విడతల వారీగా హౌసింగ్ పథకంలో 3559 ఇళ్లు మంజూరు చేశారు. ఈ ప్రక్రియ 2021లో ప్రారంభమైనప్పటికీ మంజూరైన ఇళ్లలో నేటికి కేవలం 777 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయంటే లబ్ధిదారుల్లో నెలకొన్న నిరాసక్తతను అర్థం చేసుకోవచ్చు. ఎద్దు ఈనిందీ అంటే దొడ్లో కట్టేయమన్న చందంగా వేల సంఖ్యలో ఇళ్లు ఇచ్చామన్న గొప్పల కోసం గత పాలకులు కాలనీలను కొండలు, గుట్టలు, ఏటవాలు ప్రాంతాల్లో ఏర్పాటు చేయడంతో తొలుత ఇళ్ల నిర్మాణాలపై ఆసక్తి చూపినా.. అక్కడ ఎదురైన ప్రతిబంధకాలను అధిగమించలేక ఆ తరువాతి కాలంలో లబ్ధిదారులు చేతులెత్తేశారు.

కనీస వసతులు కరువు

తమ ఏలుబడిలో సొంతిల్లు లేని నిరుపేదలు లేకుండా చేస్తామని గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. దాన్ని సాకారం చేసుకునే క్రమంలో లెక్కకు మిక్కిలి ఇళ్లను మంజూరు చేసింది. వాటికి లేఔట్లు ఏర్పాటు చేసి 'జగనన్న కాలనీ'లు అంటూ నామకరణం చేసింది. ఆయా లేఔట్లలో అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని, తద్వారా జగనన్న కాలనీలు భవిష్యత్తులో శాటిలైట్ సిటీలుగా మారుతాయని ఆర్భాటం చేసింది. వినడానికి బాగానే ఉన్నా ఆచరణలోకి వచ్చేటప్పటికి గత ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. అందుకు పీలేరు పట్టణానికి ఆనుకుని ఉన్న కంకర ఫ్యాక్టరీ, ఏపీఐఐసీ, ఆయిల్ సీడ్స్ లేఔట్లు సజీవ సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి. కొండలు, గుట్టలు, వాగులు, వంకలతో నిండిన ప్రాంతాల్లో లేఔట్లు వేసి లక్కీ డిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టుకోవాలని పురమాయించింది. సొంతింటి కలను సాకారం చేసుకునే క్రమంలో లబ్ధిదారులు ఎన్నో ఆశలతో అక్కడకు చేరుకుని కళ్ల ముందున్న పెద్దపెద్ద బండరాళ్లు, గుట్టలను చూసి నిర్ఘాంతపోయారు. తమకు మరోచోట ఇంటి స్థలం చూపించాలని చాలా మంది విజ్ఞప్తి చేసినా పట్టించుకోని నాటి పాలకులు తాము నిర్దేశించిన కాలంలో ఇళ్లు పూర్తి చేయకుంటే రద్దు చేస్తామని హుకుం జారీ చేశారు. దాంతో చాలా మంది లబ్ధిదారులు అయిష్టంగానే ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. తమకు దక్కిన స్థలాన్ని నిర్మాణానికి అనువుగా మార్చుకోవడానికి ఒక్కొక్క లబ్ధిదారుడికి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల దాకా వ్యయం అయింది. నిర్మాణ సామగ్రిని తరలించుకోవడానికి సరైన రోడ్డు వసతి కూడా లేకపోవడంతో ట్రాక్టరు, మినీ ఆటో, మినీ లారీల యజమానులను బతిమాలి, బుజ్జగించుకుని అక్కడకు తరలించుకున్నారు. కాలక్రమంలో రోడ్డు, నీటి వసతి కల్పిస్తామన్న నాటి పాలకుల మాటలు నమ్మి నిర్మాణాలు కొనసాగించారు. అయితే ఏళ్లు గడుస్తున్నా సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో అధిక శాతం లబ్ధిదారులు నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేశారు. ఆయా లేఔట్లలో నేటికీ సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అధికారులు పలుమార్లు హెచ్చరించినా లబ్ధిదారులు నిర్మాణాలు కొనసాగించేందుకు ఆసక్తి చూపడం లేదు. కడప మార్గంలో ఉన్న ఏపీఐఐసీ-1 లేఔట్‌లో గతంలో మూడు బోర్లు పనిచేస్తుండగా మూడు నెలల క్రితం కొంతమంది దుండగులు బోర్లలో రాళ్లు వేసేసి, స్టార్టర్లను ధ్వంసం చేశారు. వాటి మరమ్మతుల గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో అక్కడ నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి.

పీలేరులో మండలంలో గృహనిర్మాణ ప్రస్తుత స్థితి

మండలంలోని మొత్తం లే-ఔట్లు	43
వాటిలోని ప్లాట్లు	12,831
హౌసింగ్ శాఖ అనుమతులు ఇచ్చిన ప్లాట్లు	3559
ఇంకా పనులు ప్రారంభించనివి	10
పునాదుల దశలోనే ఉన్నవి	358
పునాదుల పూర్తయినవి	13
బేస్‌మెంట్ వరకు నిర్మాణం జరిగినవి	1997
సగం గోడలు నిర్మాణం జరిగిన ప్లాట్లు	24
పూర్తి గోడలు నిర్మాణం జరిగినవి	302
మోల్డింగ్ వేసిన ప్లాట్లు	78
సంపూర్ణంగా పూర్తయిన ఇళ్లు	777



ఏపీఐఐసీ-1 లేఔట్‌లో నిర్మాణాల దుస్థితి

త్వరలోనే కాలనీలను సందర్శిస్తాను

- ఇరగన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పీలేరు

నేను ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో పీలేరుకు వచ్చాను. త్వరలోనే కాలనీలను సందర్శిస్తాను. అక్కడ ఉన్న నీటి సమస్యలను గుర్తించి, ఉన్నతాధికారులకు నివేదించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాను.

అవగాహన సదస్సులతో లబ్ధిదారుల్లో ఆశలు

పూర్తిగా స్తంభించిపోయిన కాలనీల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం గత నెల 28న పీలేరులోని వివిధ లేఔట్లలో 'మన ఇల్లు-మన గౌరవం' పేరుతో అవగాహన సదస్సులు నిర్వహించింది. కాలనీలు ఏర్పాటు సమయంలో కనిపించిన పెద్దసార్లు ఆ రోజు తమ వద్దకే రావడంతో లబ్ధిదారులు తమ కష్టాలన్నింటినీ వారి ముందు ఏకరవు పెట్టారు. లబ్ధిదారుల కష్టాలు వినడమే కాకుండా కాలనీల్లోని అధ్వాన పరిస్థితులను స్వయంగా పరిశీలించిన ఆ అధికారుల నోట మాట రాలేదు. వసతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయలేమని గ్రహించిన వారు, కాలనీల్లో రోడ్లు, తాగునీరు, మురుగునీటి కాలువల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. వారి హామీలైనా నెరవేరుతాయేమో వేచి చూడాలి.

నీళ్ల సౌకర్యం ఉన్నన్నాళ్లూ పనులు జరిగాయి..



మా కాలనీలో మూడు నెలల క్రితం మూడు బోర్లు పనిచేస్తుండేవి. మాలో ఎవరో ఒకరం బోరు ఆన్ చేసుకుని నీళ్లు పట్టుకుని ఇంటి పనులు చేసుకునేవాళ్లం. మూడు నెలల క్రితం ఎవరో దుండగులు బోర్లలో రాళ్లు వేసేసి స్టార్టర్లు పాడు చేసేశారు. అప్పటి నుంచి నీళ్లు లేక పనులు నిలిచిపోయాయి. ఇంటి అవసరాల కోసం రూ.750లతో ఒక ట్యాంకరు కొంటున్నాం.

- నారాయణ, ఏపీఐఐసీ-1 లే-ఔట్ లబ్ధిదారుడు

ట్యాంకరు నీటితో సరిపుచ్చుకుంటున్నాం..



ప్రతి 15 రోజులకు ఒక ట్యాంకు కొనుక్కుంటున్నాం. పోయిన నెలలో ఆఫీసర్లు వచ్చి బోర్లు రిపేరు చేస్తామన్నారు. ఇంత వరకు ఎవరూ పట్టించుకోలేదు. ఆ బోర్లు పనిచేస్తే ఇక్కడ హడావిడి ఉంటుంది.

- అబ్దుల్ అజీజ్, ఏపీఐఐసీ-1 లే-ఔట్ లబ్ధిదారుడు



కంకర ఫ్యాక్టరీ లేఔట్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణాలు



గుంతలమయంగా ఉన్న ఏపీఐఐసీ-1 ప్రధాన రహదారి

21 మంది ఎంపీడీవోల బదిలీ

కడప(రూరల్), అక్టోబరు 4: ఉమ్మడి కడప జిల్లాలోని 21 మంది ఎంపీడీవోలను జడ్పీశాఖ బదిలీ చేసింది. వీరితో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఏడుగురు ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు ఇవ్వగా మరో ఏడుగురు ఏవోలను ఇన్‌చార్జ్ ఎంపీడీవోలుగా నియమించారు. ఇలా ఉమ్మడి కడప జిల్లాలోని మొత్తం 35 మండలాలకు ఎంపీడీవోలను నియమించారు. ఈ మేరకు జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఆయా మండలాలకు కేటాయించిన ఎంపీడీవోలకు ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇచ్చారు. వీరంతా శుక్రవారం జడ్పీ కార్యాలయానికి వచ్చి ఆర్డర్స్ తీసుకుని ఆదే రోజు వారు బదిలీ అయిన మండలాలకు చేరుకుని ఎంపీడీవోలుగా బాధ్యతలు చేపట్టారు. వీరితో పాటు 13 మంది ఈవోపీఆర్డీలు బాధ్యతలు చేపట్టారు.

35 మంది ఎంపీడీవోల వివరాలు

పేరు	ప్రస్తుతం	బదిలీ
సి.వెంకటరామయ్య	పెద్దముడియం	ఎర్రగుంట్ల
జె.సుజాతమ్మ	అట్లూరు	నందలూరు
జి.రెడ్డెయ్య	ఒంటిమిట్ట	లక్కిరెడ్డిపల్లె
సి.వెంకటేశ్	పులివెందుల	రాయచోటి
కె.కుళ్లాయమ్మ	ప్రొద్దుటూరు	వేంపల్లె
ఏవీ రమణారెడి	వీఎన్‌పల్లె	రాజుపాళెం
సి.రామక్రిష్ణయ్య	గోపవరం	దువ్వూరు
కేవీ శ్రీధర్‌నాయుడు	చాపాడు	మైదుకూరు
సీఏ జవహర్‌బాబు	సిద్దవటం	గాలివీడు
ఎస్.దివిజ	వేంపల్లె	ఖాజీపేట
పి.జయశ్రీ	వల్లూరు	పుల్లంపేట
ఎస్.షంసద్‌భాను	మైలవరం	పెద్దముడియం
ఎస్.విజయరావు	ఓబులవారిపల్లె	పెనగలూరు
పి.వరప్రసాద్	పెనగలూరు	రాజంపేట
ఎ.మల్‌రెడ్డి	రాయచోటి	ఓబులవారిపల్లె
ఎస్.రామచంద్ర	టి.సుండుపల్లె	సంబేపల్లె
జీవీ రఘురామ్	పుల్లంపేట	వల్లూరు
ఎస్.ఫణిరాజకుమారి	రాజంపేట	సిద్దవటం
ఎస్.శ్రీనివాసరెడ్డి	గాలివీడు	లింగాల
ఎస్.సూర్యనారాయణరెడ్డి	రామాపురం	ప్రొద్దుటూరుకు
జె.జాషువా	కోడూరు	రామాపురం
ఇతర జిల్లాల నుంచి..		
బి.కిరణ్‌మోహన్‌రావు	అనంతపురం	చెన్నూరు
సయ్యద్ ఉస్నీషా	కర్నూలు	జమ్మలమడుగు
ఏ.వీరకిశోర్	ఈస్ట్‌గోదావరి	చాపాడు
పీఎం కుశాయిబాబు	చిత్తూరు	చింతకొమ్మదిన్నె
ఎస్.సుధాకర్‌రెడ్డి	చిత్తూరు	టి.సుండుపల్లె
బి.రాజశేఖర్‌రెడ్డి	చిత్తూరు	చక్రాయపేట
ఎం.రమణారెడ్డి	చిత్తూరు	గోపవరం
ఇన్‌చార్జి ఎంపీడీవోలుగా ఏవోలు..		
జి.చంద్రమౌళీశ్వర్	వీఎన్‌పల్లె	వీఎన్‌పల్లె
కె.సురేంద్రనాథ్	పెండ్లిమర్రి	పులివెందుల
వై.రామచంద్రారెడ్డి	మైలవరం	మైలవరం
బి.సోమశేఖర్	ఒంటిమిట్ట	ఒంటిమిట్ట
యు.భాస్కర్‌బాబు	అట్లూరు	అట్లూరు
ఆర్.రమణారెడ్డి	పీఆర్‌అండ్‌ఆర్డీ	పోరుమామిళ్ల
సీహెచ్ నారాయణరావు	పుల్లంపేట	రైల్వేకోడూరు

కరుణించమ్మా... కామాక్షమ్మా..

- రెండవ రోజు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం

రాయచోటిటౌన్, అక్టోబరు 4: కామాక్షి దేవి.. కరుణించమ్మా.. అంటూ భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. దసరా పండుగ సందర్భంగా రెండవ రోజు పలు ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈ నేపథ్యంలో రాయచోటి వీరభద్రాలయంలో శుక్రవారం ఆలయ డీఈ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భద్రకాళీ అమ్మవారు కామాక్షిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని పాత రాయచోటిలో గల ప్రాచీన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ద్రాక్షాయణి అమ్మవారు గాయత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే రాజంపేట పట్టణంలోని అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరిదేవి బిల్వవృక్ష అలంకరణలో, ఒంటిమిట్ట వాసవీమాత ఆలయంలో రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా రైల్వేకోడూరు, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.



కామాక్షిదేవి అలంకారంలో రాయచోటి భద్రకాళీ అమ్మవారు



ఒంటిమిట్టలో రాజరాజేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారు

వంద రోజుల ప్రణాళికను రూపొందించండి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు 4: జిల్లా ఆర్థికాభివృద్ధికి అన్ని ప్రభుత్వ శాఖలు వంద రోజుల ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాలులో 2వ విడత వంద రోజుల ప్రణాళిక రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దూరదృష్టితో విజన్ ఆంధ్ర-2047 తీసుకురావడం జరిగిందన్నారు. జిల్లాలోని కీలక రంగాలు, అంశాలపైన దృష్టి సారించి జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా విజన్ ప్లాన్ రూపకల్పన చేసుకుని రానున్న డిసెంబరు 31 నాటికి నిర్దేశించుకోవాల్సిన లక్ష్యాల ఏమిటి, ఏ విధంగా లక్ష్యాలు సాధించగలం, అందుకు తీసుకోవాల్సిన చర్యలు తదితరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆశించిన ఫలాలు అందుకునేందుకు సమగ్ర నివేదికలు రూపొందించాలన్నారు. అలాగే రానున్న ఐదు సంవత్సరాలు (2024-25 నుంచి 2028-29)లో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే విధంగా ఆయా శాఖలు ప్రణాళికలు రూపొందించుకుని లక్ష్యసాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీవో వెంకటపెద్దయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధూప దీప నైవేద్యానికి రెట్టింపు నిధులు

- ఒక్కో ఆలయానికి గతంలో రూ.5 వేలు.. ఇక నుంచి రూ.10 వేలకు పెంపు
- అర్చకులకు కూడా రెట్టింపైన గౌరవవేతనం

కలికిరి, అక్టోబరు 4: జిల్లాలో దేవదాయ శాఖ గుర్తించిన వివిధ మండలాల్లోని 251 ఆలయాల్లో రోజువారీ జరగాల్సిన ధూప దీప నైవేద్య ఖర్చుల కోసం ప్రభుత్వం ఇతోధికంగా నిధుల కేటాయింపు పెంచింది. గతంలో ఒక్కో ఆలయానికి నెలకు రూ.5 వేలు ఇస్తుండగా దానికి రెట్టింపుగా రూ.10 వేలు వంతున ఇచ్చే విధంగా గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఏడాదికి రూ.32 కోట్లు ప్రభుత్వానికి అదనంగా ఖర్చు రానుంది. దీంతో పాటు ఇప్పటి వరకు అర్చకులకు ఇస్తున్న గౌరవ వేతనాన్ని రూ.3 వేల నుంచి రూ.7 వేలకు, పూజా ద్రవ్యాలకు రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచారు. అర్చకుల గౌరవ వేతనాలతో కలిపి రూ.10 వేలు అర్చకుల పేరుతో వున్న బ్యాంకు ఖాతాకు నేరుగా జమ చేసే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా అర్చకులు, ఆలయ ధర్మకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లాలో 251 ఆలయాలకు లబ్ధి: ధూప దీప నైవేద్య నిధులను రెట్టింపు చేయడంతో 251 ఆలయాలకు లబ్ధి చేకూరనుంది. జిల్లాలో అత్యధికంగా పెనగలూరు మండలంలో 24, రామాపురంలో 22, నందలూ రులో 14, రాజంపేటలో 14, పీటీఎంలో 13, లక్కిరెడ్డిపల్లెలో 11, సుండుపల్లెలో 11 ఆలయాలకు ధూప దీప నిధులు అందుతున్నాయి. అత్యల్పంగా కురబలకోటలో 1, తంబళ్లపల్లెలో 2, బి.కొత్తకోటలో 3, గుర్రంకొండలో 3, కోడూరులో 3తో పాటు ఇతర మండలాలన్నింటిలోనూ ఓ మోస్తరు సంఖ్యలో వున్నాయి. ఇవి కాకుండా ఇప్పటివరకు నెలకు రూ.10 వేల వంతున నిధులు విడుదలవుతున్న మరో 18ఆలయాలు వున్నాయి. ఇవికాకుండా మదనపల్లె, సంబేపల్లెలో ఒక్కో ఆలయం వంతున రెండింటికి నెలకు ఒక్కోదానికి రూ.15,625 వంతున మంజూరు చేస్తున్నారు. వీటికి సంబంధించి తాజా ఉత్తర్వులో ప్రస్తావించలేదు.

రేషన్ డీలర్ల నియామకానికి గడువు కుదింపు

- వారం ముందుగానే ముగించాలని సర్కార్ ఆదేశం

కలికిరి, అక్టోబరు 4: జిల్లాలో కొత్త చౌక దుకాణాలకు డీలర్లను నియమించే ప్రక్రియను పూర్తి చేసేందుకు ముందు విధించిన గడువును కుదించి వారం ముందుగానే ముగించాల్సిందిగా ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. ప్రస్తుతం రేషన్ షాపుల మధ్య వున్న అనేక తారతమ్యాలను హేతుబద్ధీకరణ ప్రకారం సరిదిద్ది ఆపై ఉండే ఖాళీలకు, ప్రస్తుతమున్న తాత్కాలిక షాపుల స్థానాల్లో కొత్త డీలర్లను నియమించేందుకు గతంలో వివిధ తేదీలతో షెడ్యూలు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం దాని స్థానంలో ప్రభుత్వం కొత్త షెడ్యూలు ప్రకటించింది. గతంలో కొత్త డీలర్ల నియామక ప్రక్రియను పూర్తి చేసి నవంబరు 23వ తేదీ నాటికి వారందిరికీ ఈ-పోష్ యంత్రాలను అందజేయాల్సిందిగా ఆదేశించారు. అయితే కొత్త డీలర్లు 23వ తేదీ నాటికి నియామకం పొందితే ఆ తరువాత సరుకుల కోసం డీడీలు చెల్లించేందుకు, స్టాకును తీసుకునేందుకు గడువు చాలదన్న ఉద్దేశంతో నియామక ప్రక్రియను వారం ముందుకు కుదించినట్లు అధికార వర్గాల సమాచారం. అంతేకాకుండా హేతుబద్ధీకరణ ద్వారా ఒక షాపు నుంచి విడదీసి కొత్తగా ఏర్పాటు చేసే దుకాణాలకు సంబంధించి ప్రస్తుత డీలర్ల అభ్యంతరాలు కూడా స్వీకరించాలని నిర్ణయించారు. న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఈ అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించాల్సిందిగా కూడా ప్రభుత్వం జిల్లా అధికారులకు సూచనలు జారీ చేసింది. గత షెడ్యూలు ప్రకారం నవంబరు 23వ తేదీకి మొత్తం ప్రక్రియ పూర్తి కావాల్సి వుండగా, సవరించిన దాని ప్రకారం 15వ తేదీ నాటికే డిసెంబరు నెల రేషన్ పంపిణీకి కొత్త డీలర్లను సంసిద్ధం చేయనున్నారు. ఈ మేరకు సివిల్ సప్లైస్ కమిషనరు కలెక్టర్లకు తాజా ఆదేశాలు జారీ చేశారు.

ఉచిత ఇసుక అమలు కోరుతూ ధర్నా



ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

రైల్వేకోడూరు, అక్టోబరు 4: ఉచిత ఇసుకను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇసుకను అందుబాటులోకి తేలేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే ఉచిత ఇసుక పాలసీ అమలు చేస్తామని చెప్పి వంద రోజులు దాటినా ఇంత వరకూ ఉచిత ఇసుకను అమలు చేయలేదన్నారు. గత ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వంలోనే ఇసుకను ఎక్కువ ధరలకు కొనగోలు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఒక టిప్పర్ రూ. 16 నుంచి రూ. 18 వేలకు వచ్చేదని, ప్రస్తుతం ఒక టిప్పర్ రూ. 22వేలకు అమ్ముతున్నారన్నారు. బాలరాజుపల్లె, బుడుగుంటపల్లె రీచ్‌ల నుంచి ఇసుకను తీసుకు రావాలంటే డబల్ ఖర్చు అవుతోందని తెలిపారు. నందలూరు, టంగుటూరు, గుండ్లూరు, నారాయణనెల్లూరు, మందరం, బెస్తపల్లె తదితర ప్రాంతాల్లో ఉన్న ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక తరలింపు ప్రారంభించాలన్నారు. ఇసుక క్వారీల వద్ద ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లకు అనుమతి ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ, సీపీఎం నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ, ఏఐటీయూసీ నేతలపై కేసులు కొట్టివేయాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్


అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

రాయచోటి టౌన్, అక్టోబరు4: వైసీపీ ప్రభుత్వం అంగన్వాడీ, ఏఐటీయూసీలపై పెట్టిన కేసులను కొట్టివేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. శుక్రవారం అంగన్వాడీలు, ఏఐటీయూసీ నేతలు కోర్టుకు హాజరైన అనంతరం అక్రమ కేసులు కొట్టివేయాలని అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరి, కోకన్వీనర్ సరోజమ్మ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైసీపీ ప్రభుత్వంలో 42 రోజులు అంగన్వాడీలు వీరోచిత పోరాటం చేశారన్నారు. కలెక్టరేట్ వద్ద జరిగిన అంగన్వాడీల ఆందోళనల్లో పాల్గొన్న అంగన్వాడీ, ఏఐటీయూసీ నేతలపై వైసీపీ ప్రభుత్వం నమోదు చేసిన అక్రమ కేసులు కొట్టివేయాలన్నారు. ఈవిషయమై అప్పటి ప్రతి పక్ష పార్టీలు, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్వాడీలను ఆదుకుంటామని చెప్పిన ప్రకారం సమ్మె కాలపు హామీలు అమలు చేయడం, అక్రమ కేసులు కొట్టివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ లీడర్లు సుజాత, అనురాధ, ఏఐటీయూసీ నేతలు మురళి, లంబాడీ హక్కుల పోరాట సంఘం నాయకులు శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరిస్తాం

- మండల పరిషత్ అధ్యక్షురాలు ఆవుల నాగశ్రీలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

సంబేపల్లె, అక్టోబరు4: అధికారుల సమన్వయంతో తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మి తెలిపారు. బీసీ వసతి గృహంలో విద్యార్థులకు నీటి సమస్య ఉన్నట్లు హాస్టల్ వార్డెన్ మండల సమావేశంలో ఆమె దృష్టికి తీసుకొచ్చారు. గుట్టపల్లి, ఎస్.సోమవరం, సంబేపల్లె, దుద్యాల, రౌతుకుంట గ్రామాల్లో తాగునీటి సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ మహేశ్వరి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఉపాధి పనులు ఏడాదికి సంబంధించి గర్తించినట్లు ఏపీఓ రెడ్డిజవహర్ తెలిపారు. జడ్‌హెచ్‌డీసీ భూములకు సంబంధించి అసైన్మెంట్ రైతులకు చేశారని, పాస్ పుస్తకాలు లేవని సర్పంచ్ మోహన్ తెలియజేశారు. తహసీల్దార్ కలగజేసుకుని ఈ విషయం జేసీతో మాట్లాడతామని త్వరలో వచ్చేలా చూస్తామన్నారు. ఎంపీడీఓ సునీల్‌కుమార్ వైద్యాధికారులతో మాట్లాడుతూ 108 వాహనం మండలంలో అందుబాటులో ఉండేలా చూడాలని వారికి ప్రత్యేక గది ఏర్పాటు చేయాలని సూచించారు. హార్టికల్చర్ కింద రైతులకు టమోటా స్టైకింగ్, మార్చిలింగ్‌కు సబ్సిడీ అందిస్తున్నట్లు ఏఓ తెలిపారు. పుచ్చదోస, రైతులకు మల్చింగ్ సబ్సిడీకి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. జడ్పీటీసీ గొర్ల కవిత మాట్లాడుతూ శెట్టిపల్లెలో ఈక్రాప్ నమోదులో అక్రమాలు చేశారని, ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. గ్రామ వ్యవసాయ అధికారికి నోటీస్ జారీ చేసినట్లు ఏఓ కిశోర్‌నాయక్ తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్‌లో బలవంతపు రాజీనామాలు చేయవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల అధికారులు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

శాప్ చైర్మన్‌ను కలిసిన మురళీనాయుడు


రవి నాయుడును కలిసిన యువగళం సభ్యులు

చిన్నమండెం, అక్టోబరు4: క్రీడా సాధికారిక సంస్థ చైర్మన్ అనిమిని రవినాయుడును ప్రమాణస్వీకారం అనంతరం చిన్నమండెం మండల యువగళం వలంటరీ సభ్యుడు మురళీనాయుడు, సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం విజయవాడలో వారు కలిసి రాయలసీమ ప్రాంతం క్రీడారంగంలో చాలా వెనుకబడి ఉంది. కాబట్టి సీమ జిల్లాల్లో మండలానికి ఒక క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని కోరారు. క్రీడాకారులను మంచి శిక్షకులను ఏర్పాటు చేసి వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమ పిల్లలు కూడా ఉన్నత స్థానాలకు ఎదిగే విధంగా ప్రోత్సహించాలని కోరినట్లు వారు తెలిపారు.

శాప్‌చైర్మన్ కలసిన మండల తెలుగుయువత

లక్కిరెడ్డిపల్లె అక్టోబరు4: శాప్‌చైర్మన్ రవినాయుడిని ప్రమాణ స్వీకారం అనంతరం లక్కిరెడ్డిపల్లె మండల తెలుగుయువత అధ్యక్షుడు పక్కీరయ్య కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాజంపేట పార్లమెంట్ యువజన అధ్యక్షుడు తోపిరెడ్డి నవీణ్‌కుమార్‌రెడ్డి రవినాయుడికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. రోడ్డు రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లె, టీడీపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లురవీంద్రను కలసి లక్కిరెడ్డిపల్లె సమస్యలు మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు పక్కీరయ్య, నవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

నరకం గ్రామీణ మార్గం

ఈ రోడ్లకు మోక్షమెప్పుడో

గుంతలమయమైనా పట్టించుకోని అధికారులు


కంకర తేలిన కాలాడివాండ్లపల్లె రోడ్డు

లక్కిరెడ్డిపల్లె అక్టోబరు4: రాష్ట్రానికి పట్టగొమ్మలైన గ్రామాలకు సరైన రోడ్ల వసతి లేక ప్రజలు చాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లన్నీ గుంతలమయం, కంకర లేసి దారంతా రాళ్లు, గుంతలతో దర్శనమిస్తున్నాయి. ఈరహదారుల్లో ప్రయాణం నరకాన్ని తలపిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు పిడికెడు మట్టివేసిన పాపానపోని కారణంగా దాదాపు 16 గ్రామపంచాయతీల రోడ్లన్నీ అధ్వాన్నంగా తయారయ్యాయి. లక్కిరెడ్డిపల్లె నుంచి పాళెంగొల్లపల్లెకు 16 కిలోమీటర్లు ఉంది. సన్నాకుల మర్రిమాను నుంచి పాళెం ఎగువపల్లెకు 11 కిలోమీటర్లు. రోడ్డు సక్రమంగా ఉంటే 20నిమిషాలకు వెళ్లవచ్చు. ప్రస్తుతం పాళెం ఎగువ పల్లె వెళ్లాలంటే గంట సమయం పడుతోందని పాళెం గొల్లపల్లె గ్రామస్తులు వాపోతున్నారు. లక్కిరెడ్డిపల్లె నుంచి కాలాడివాండ్లపల్లెకు 8కిలోమీటర్లు. ఆ రోడ్డు పనులు మధ్యలో నిలిచిపోవడంతో కంకర తేలింది. గురవయ్యగారిపల్లె నుంచి కస్తూరిరాజుగారిపల్లె, సిద్ధకవాండ్లపల్లె, దిగువెత్తుకవాండ్లపల్లె, ఎగువెత్తుకవాండ్లపల్లె, వాయిల్‌రాజుగారిపల్లె తారు రోడ్డంతా గుంతలమయమే. ఆ దారిన వెల్లాలంటే నరకమేనని స్థానికులు వాపోతున్నారు. సూరకవాండ్లపల్లె నుంచి కుర్నూతలకు 15 కిలోమీటర్లు మధ్యలో కాకుళవరం, మిద్దెమీదపల్లె, కాకుళవరం హరిజనవాడ, వాయిల్‌రాజుగారిపల్లె, గ్రామాల నుంచి కుర్నూతలకు రావాలంటే తారు రోడ్డంతా కంకర లేచాయి. ద్విచక్రవాహన దారులు కచ్చితంగా కింద పడాల్సిందేనని వాహనదారులంటున్నారు. రాయచోటి, లక్కిరెడ్డిపల్లె ప్రాంతాల నుంచి నిత్యం వందల వాహనాలు, ఆర్టీసీ బస్సులు, ఈ మార్గాన వెళ్లాలి మర్రిమాను క్రాస్ నుంచి పందిళ్లపల్లె వరకు రోడ్డంతా గుంతలు, రాళ్లు, తేలి అధ్వాన్నంగా తయారైంది. కనీసం చిన్న చిన్న మరమ్మతులకు కూడా నోచుకోలేదు. గంగమ్మ జాతరకు ప్రతి ఆది వారం వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఈ రోడ్డు మార్గంలో గతంలో ముగ్గు రు నిండు ప్రాణాలు పోగొట్టుకున్నారు. దప్పేపల్లె పంచా యతీలో గల్లావాండ్లపల్లె, వేల్పుచర్లవాండ్లపల్లె, గొల్లపల్లె, వెల్లాలన్నా సరైన రోడ్డు లేదు. దప్పేపల్లె, హరిజనవాడ, కొత్తపల్లె, వీరారెడ్డిగారిపల్లె, నాగిరెడ్డిపల్లె, మేడిమాకులగుంత గ్రామాలకు సరైన రోడ్డు లేక ఇరుకు మట్టిరోడ్డపైనే ప్రయాణిస్తున్నారు. లక్కిరెడ్డిపల్లె నుంచి పెద్దపల్లె, పర్వతరెడ్డిగారిపల్లె, దిన్నెపాడు, కొత్తవడ్డెపల్లె, కొండవాండ్లపల్లె, కొనసాని గారిపల్లెల రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయి. ఈ రోడ్లకు మోక్షమెప్పుడోనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాయలసీమకే తలమానికంగా ఉన్న అనంతపురం గంగమ్మజాతర రోడ్డు చాలా అధ్వాన్నంగా ఉంది. రవీంద్రనగర్ నుంచి వయా గంగమ్మ జాతర చిల్లారు వరకు నిత్యం అటు జాతరకు, లక్కిరెడ్డిపల్లెకు వాహనాలు వెళుతూ ఉంటాయి. మండలంలో ఒకటి కాదు రెండుకాదు మొత్తం రోడ్లన్నీ చాలా అధ్వాన్నంగా ఉన్నా అధి కారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం గుంతలు, కంకర లేచిన రోడ్లకు మరమత్తులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


పాళెంగొల్లపల్లె వద్ద అధ్వాన్నంగా ఉన్న రోడ్డు

రోడ్డులో వెళ్లాలంటే నరకమే



లక్కిరెడ్డిపల్లె, అప్పకొండయ్యగారిపల్లె నుంచి కాలాడివాండ్లపల్లె రోడ్డును త్వరగా పూర్తిచేయాలి. రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు చొరవతీసుకుని రోడ్డుపనులను పూర్తి చేయాలి ద్విచక్ర వాహనాల్లో వెళ్లాలంటే నరకమే. వైసీపీ ప్రభుత్వంలో మధ్యలో పనులు ఆగిపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కాలాడివాండ్లపల్లె కంకర రోడ్డుపనులు పూర్తిచేయాలి

కొనసాని రాజారెడ్డి, కొనసానివారిపల్లె

మాం పాహి పరమేశ్వరి

దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో బిల్వవృక్ష నివాసిని అలంకారం ● గాయత్రీ అలంకారంలో భక్తులకు అభయం



రాజంపేటలో బిల్వవృక్ష నివాసిని అలంకరణలో వాసవి కన్యకాపరమేశ్వరిదేవి



రైల్వేకోడూరులో జగన్మోహిని - రాయచోటి కన్యకాపరమేశ్వరాలయంలో అన్నపూర్ణాదేవి - ఉమామహేశ్వరాలయంలో భవానీదేవి - నందలూరులో పార్వతిదేవి అలంకారాలు

రాజంపేట టౌన్, అక్టోబరు 4: మాం పాహి పరమేశ్వరి అంటూ భక్తులు బిల్వవృక్ష నివాసిని పార్వతీ మాతను కొలిచారు. దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండో రోజు సానిక అమ్మవారిశాలలో కన్యకా పరమేశ్వరి దేవి బిల్వవృక్ష అలంకరణలో భక్తులకు అభయం నొసంగారు. చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారు కామాక్షిదేవి, వెంకటరాజంపేట కనకదుర్గ ఉమామహేశ్వరి ఆలయంలో అమ్మవారు కనకదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయాలకు విశేషంగా భక్తులు హాజరై వివిధ రూపాల్లో దర్శనమిస్తున్న అమ్మవార్లను దర్శించుకున్నారు.

రైల్వేకోడూరులో జగన్మోహిని....

రైల్వేకోడూరు, అక్టోబరు 4: ఆర్యవైశ్య ఆలయంలో శుక్రవారం జగన్మోహిని అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. వందలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు పూజలు చేశారు.

నందలూరులో పార్వతిదేవి...

నందలూరు, అక్టోబరు 4: నాగిరెడ్డిపల్లెలో వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం రాత్రి పార్వతిదేవి అలంకారంలో కన్యకా పరమేశ్వరిదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకటకుమార్, చలపాటి నరసింహశ్రేష్టి, యువజన సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు భూపాలం సునీల్ కుమార్, గెలివి లోకేష్, సభ్యులు పాల్గొన్నారు.

నేడు గజలక్ష్మీదేవి...

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి గజలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

సుండుపల్లెలో గాయత్రిదేవి...

సుండుపల్లె, అక్టోబరు4: స్థానిక కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరించినట్లు తెలిపారు. ప్రత్యేక పూజలు నిర్వహించి టెంకాయలు కొట్టి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు తెలిపారు.

ఒంటిమిట్టలో రాజరాజేశ్వరిదేవి...

ఒంటిమిట్ట, అక్టోబరు 4: దసరా సరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం నిర్వహించారు. ఉదయం అమ్మవారు దీక్షాబంధన్ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారు రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శన మిచ్చారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

లక్కిరెడ్డిపల్లెలో గాయత్రిదేవి...

లక్కిరెడ్డిపల్లె అక్టోబరు4: శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం సర్వ మంగళాదేవి గాయత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శమిచ్చింది. భక్తులు అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు.

గాలివీడులో బాలత్రిపుర సుందరి...

గాలివీడు, అక్టోబరు4: బాలాత్రిపుర సుందరి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. గుండ్లచెరువు పంచాయతీ పశువులవాండ్లపల్లిలోని దుర్గామాత, గోపనపల్లె గ్రామం పూజారివారిపల్లెలోని ఇరుగులమ్మ ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు నిర్వహించారు.

చిన్నమండెంలో భవానీదేవి...

చిన్నమండెం, అక్టోబరు4: కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని భవానీదేవిగా అలంకరించారు. అమ్మవారి దర్శనం చేసుకున్న మహిళలు మొక్కులు తీర్చుకున్నారు.

వినాయక నగర్‌లో గాయత్రీదేవి...

పెనగలూరు, అక్టోబరు 4: పెనగలూరు పంచాయతీ వినాయకనగర్‌లో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం బాలా త్రిపురసుందరి దేవి అలంకరణ, సాయంత్రం గాయత్రీదేవి అలంకరణ జరిగాయి. ప్రజలు, యూత్ సభ్యులు పాల్గొని భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

14 నుంచి పల్లె పండుగ : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్) అక్టోబరు 4: అక్టోబరు 14 నుంచి 21 వరకు పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంపై అధికారులతో మాట్లాడుతూ అక్టోబరు 14 నుంచి గ్రామాల్లో సీసీ రోడ్లు, పాఠశాలల ప్రహరీ, కల్వర్టులకు ఎమ్మెల్యేల ద్వారా శంకుస్థాపనలు చేసి పనులు మొదలు పెట్టాలన్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉపాధి పనులకు మెటీరియల్ కాంపోనెంట్ పనులు గ్రౌండింగ్, జియోట్యాగ్ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ మద్దిలేటి, పంచాయితీ రాజ్ ఎస్‌ఈ దయాకర్ రెడ్డి, అర్‌అండ్‌బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు విద్యుత్ ఏఈగా సుబ్రహ్మణ్యం



రైల్వేకోడూరు, అక్టోబరు 4: విద్యుత్ ఏఈగా సూర్ల సుబ్రహ్మణ్యం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం నుంచి బదిలీపై రైల్వేకోడూరుకు వచ్చారని ఏడీ భాస్కర్‌రావు తెలిపారు. విద్యుత్ సమస్యలు త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు.

హలో మాల... చలో రాయచోటి పోస్టర్ల ఆవిష్కరణ

రాయచోటిటౌన్, అక్టోబరు4: ఎగువ అబ్బవరం పొదలపల్లిలో హలో మాల... చలో రాయచోటి పోస్టర్లను ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు చింతపర్తి శివయ్య మాట్లాడుతూ 6వ తేదీ ఆదివారం ఎన్జీఓ హోంలో వర్గీకరణ వ్యతిరేక సభ తొలిసారిగా అన్నమయ్య జిల్లాలో తలపెట్టిన హలో మాల.. చలో రాయచోటిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి మాలపల్లి నుంచి పెద్ద ఎత్తున మాలలు, మాల ఎంప్లాయీస్, నాన్ ఎంప్లాయీస్, మాల మహానాడు నేతలు, అంబేద్కర్ వాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మహిళా పోలీసును పరామర్శించిన కలెక్టర్


వరలక్ష్మిని పరామర్శిస్తున్న కలెక్టర్

రాయచోటిటౌన్, అక్టోబరు4: సచివాలయ మహిళా పోలీసు వరలక్ష్మిని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పరామర్శించారు. సుండుపల్లె మండలం పొలిమేరపల్లి సచివాలయ మహిళా పోలీసు వరలక్ష్మి విధుల్లో భాగంగా అక్టోబరు 1న పింఛను పంపిణీ నిమిత్తం వెళుతుండగా ప్రమాదానికి గురయ్యారు. కాలు విరిగి సాయిప్రశాంతి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఆమెను కలెక్టర్ పరామర్శించి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం తరపున రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని కలెక్టర్ అందజేశారు. ఆమెకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆస్పత్రి యాజమాన్యానికి సూచించారు.

పొందలూరులో వైభవంగా రథోత్సవం



పెనగలూరు, అక్టోబరు 4: పొందలూరు హరిజనవాడలో సీతారాముల రథోత్సవం జరిగింది. అనంతరం వసంతోత్సవాన్ని యువకులు వైభవంగా నిర్వహించారు. గ్రామంలో నూతన రామాలయం నిర్మించి 41 రోజులు పూర్తి అయినట్లు తెలిపారు. పాత సింగనమలలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత వామనమూర్తి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. గుండ్లూరు శంకరయ్య, లక్ష్మీదేవి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న స్కూటర్

పెనగలూరు, అక్టోబరు 4: కడప నుంచి తిరుపతికి వెళుతున్న ఎలెక్ట్రికల్ బస్సును వెనుకవైపు నుంచి స్కూటీ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. కడప - చైన్నై జాతీయ రహదారిపై కోదండరామాలయం వద్ద శుక్రవారం సాయంత్రం బస్సును స్కూటీ ఢీకొనడంతో స్కూటీలో ప్రయాణిస్తున్న ఇద్దరు కిందపడడంతో గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

సీఎంను కలసిన కోడూరు ఎమ్మెల్యే



రైల్వేకోడూరు, (రూరల్) అక్టోబరు 4: తిరుమల పర్యటన కోసం వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబును రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కలిశారు. శుక్రవారం రేణిగుంట విమానాశ్రయం వద్ద సీఎంను కలిసి నియోజకవర్గం సమస్యలను విన్నవించారు.

అనుమతులు లేనిదే బోర్లు వేస్తే చర్యలు తప్పవు

సంబేపల్లె, అక్టోబరు4: అధికారుల అనుమతి లేనిదే బోర్లు వేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ సునీల్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక కమిటీలో తహసీల్దార్, ఎంపీడీఓ ఉంటారని మరో కమిటీలో వీఆర్‌ఓ పంచాయతీ కార్యదర్శి ఉంటారన్నారు. ఆమోదం పొందిన తర్వాతే తాగునీటికైనా, వ్యవసాయానికైనా బోరు వేసుకోవచ్చన్నారు.

ఆదర్శ పాఠశాలలో వృత్తి విద్యా కోర్సులు

పుల్లంపేట, అక్టోబరు 4: ఆదర్శ పాఠశాలలో పూర్తి విద్యా ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం అమలు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ లీలాశ్రీహరి తెలిపారు. శుక్రవారం పుల్లంపేట సచివాలయంలో ఆన్‌లైన్‌లో డేటా ఎలా సంప్రదించాలనే విషయమై విద్యార్థులకు తెలియజేశారు. 12 రోజులు దీనిపై పూర్తిస్థాయిలో విద్యార్థులకు నేర్పిస్తామన్నారు.

సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోండి

లక్కిరెడ్డిపల్లె అక్టోబరు4: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ఉలవ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర సాధికార కమిటీ సభ్యుడు మండ్ల రామాంజనేయులు పేర్కొన్నారు. కుర్నూతల పంచాయతీలో సబ్సిడీ ఉలవలు పంపిణీ చేశారు. 80శాతం సబ్సిడీతో రూ.175కు 4 కిలోల ఉలవలను పొందవచ్చన్నారు. ఇటీవల కురిసిన వర్షాలు అదును ఉందని రైతులు ఉలవ పంట సాగుచేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కీర్తి, గ్రామ నేతలు తదితరులు పాల్గొన్నారు

పింఛా ప్రాజెక్టు పరిశీలన


డీఈ చెంగల్‌రాయుడుతో మాట్లాడుతున్న రైతులు

సుండుపల్లె, అక్టోబరు4: సుండుపల్లె, కేవీపల్లి మండలాల సరిహద్దు ప్రాంతం యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి పింఛా ప్రాజెక్టును డీఈ చెంగల్‌రాయుడు, ఏఈ నాగేంద్రనాయక్ శుక్రవారం పరిశీలించారు. త్వరగా ప్రాజెక్టు మరమ్మత్తులు పూర్తి చేసి నీటిని నిల్వ చేయాలని స్థానిక రైతులు ఉత్తమ రైతు అమ్మనాయక్ వినతి పత్రాన్ని అందజేశారు. కుడికాల్వ గేటు ఏర్పాటు చేసి వందలాది మంది రైతులకు సాగు నీరు అందించాలన్నారు. కొత్తగా నిర్మించిన కాంక్రీట్ కట్టను అధికారులు పరిశీలించారు. తుఫాను కారణంగా మట్టికట్ట తెగిపోయినట్లు సిబ్బంది వివరించారు. త్వరగా పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. కుడి, ఎడమ కాల్వల దిగువ భాగంలో రైతులు పడుతున్న సమస్యలను వారు తెలుసుకున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్‌డే



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

రైల్వేకోడూరు, అక్టోబరు 4: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం. భాస్కర్‌రెడ్డి సెకండ్, ఫైనల్ ఇయర్ డిగ్రీ విద్యార్థులు ఫస్ట్ ఇయర్ విద్యార్థులను ఆహ్వానిస్తూ ఫ్రెషర్‌డే నిర్వహించడం సంతోషకరమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అందుకోవాలని తెలిపారు. వసతులను అందిపుచ్చుకుని పేరు ప్రతిష్ఠలు తీసుకు రావాలన్నారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థిని, విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేశారు. వైస్ ప్రిన్సిపాల్ జి. రమేష్, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ కే. రమేష్, ఎస్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎస్. బాలసుబ్రహ్మణ్యంరాజు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కొండలా పేరుకుపోతున్నాయి..



వసంతపేట మున్సిపల్ కాంప్లెక్స్

- ముున్సిపల్ గదుల అద్దె వసూళ్లలో నిర్లక్ష్యం
- లక్షల్లో పేరుకుపోతున్న బకాయిలు
- నోటీసులకే పరిమితమవుతున్న రెవెన్యూ సిబ్బంది
- కఠినంగా వ్యవహరిస్తే తప్ప వసూళ్లు కాని అద్దెలు

ప్రొద్దుటూరు, అక్టోబరు 4: మున్సిపాలిటీ అద్దె గదులు ఒక్కసారి లీజుకు తీసుకుంటే చాలు.. ఇక సొంత గదులు లాగే వ్యాపారులు భావిస్తుంటారు. నెలనెల అద్దెలు చెల్లించాలని ఏ మాత్రం భావించరు. మున్సిపల్ సిబ్బంది సైతం అద్దెలు వసూళ్ల చేయాలనే తలంపు వుండదు. దీంతో వ్యాపారులు తమ ఇష్టారాజ్యంగా ఎప్పుడో ఒకప్పుడు కట్టవచ్చనే నిర్లక్ష ధోరణిలో ఉంటున్నారు. దీంతో అద్దె బకాయిలు వసూళ్లకాక లక్షల్లో పేరుకుపోతున్నాయి. ఇక ఎప్పుడైనా ఒత్తిడి చేస్తే.. అంత చెల్లిస్తాం.. ఇంత చెల్లిస్తాం అంటూ రాజకీయనేతలతో సిఫారస్సులు చేయిస్తూ ముఖం చాటేస్తారు. దీంతో ఏడాదికి మున్సిపల్ అద్దెగదులకు రావాల్సిన డిమాండ్ ప్రకారం వసూళ్ల కాక మున్సిపల్ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. దీనిపై మున్సిపల్ రెవెన్యూ విభాగపు అధికారులు అద్దె గదుల వసూళ్లకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ చేపట్టడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అద్దె గదుల బకాయిలు ఇలా...

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పలు ప్రాంతాల్లో మున్సిపల్ అద్దె గదులు వున్నాయి. ఓల్డ్ మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 10, వసంతపేట మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 21, స్టేట్ బ్యాంకు వద్ద గల షాపింగ్ కాంప్లెక్స్‌లో 20, సిరిపురి కాంప్లెక్స్‌లో 2, వైఎంఆర్‌కాలనీ పార్కు వద్ద 3, గంగమ్మ దేవలం వీధిలో 1, కామిశెట్టి సుబ్బారావు టీబీ కాంప్లెక్స్‌లో 61 మొత్తం కలిపి 119 అద్దె గదులు వున్నాయి. కాగా, మున్సిపల్ అద్దె గదుల బకాయిలు సెప్టెంబరు 19 వరకు వున్న మొత్తం రూ.35.29లక్షలు. ఇందులో ఓల్డ్ మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌లో పది గదులకు గాను 8 గదులకు సంబంధించి మొత్తం రూ.9,05,160 బకాయి ఉన్నారు. వసంతపేట షాపింగ్ కాంప్లెక్స్‌లో 21 గదులకు గాను 4 గదులకు రూ.2,67,878 బకాయి పడ్డారు. స్టేట్ బ్యాంకు పక్కన గల షాపింగ్ కాంప్లెక్స్‌లో 20 గదులకు గాను 8 గదుల బకాయిలు రూ.1,00,214, పాణ్యం ఎర్రమునిరెడ్డి కాలనీ ఎంట్రెన్స్‌లో వున్న సిరిపురి కాంప్లెక్స్‌లో రెండు పెద్ద గదులు వుండగా అందులో 1 గదికి రూ.9,10,336 బకాయి వుంది. పాణ్యం ఎర్రమునిరెడ్డి సర్కిల్‌లో గల కామిశెట్టి సుబ్బారావు టీబీ కాంప్లెక్స్‌లో మొత్తం 61 గదులు వున్నాయి. ఇందులో 29 గదులకు రూ.13,45,416 బకాయిలు వున్నారు. మొత్తం 119 గదులలో 22 గదులు ఖాళీగా వున్నాయి. ప్రస్తుతం 97 గదులకు మాత్రమే అద్దెలు వసూళ్ల అవుతున్నాయి. 97 గదుల్లో 50 గదులు అద్దె బకాయిలున్నాయి. ఈ తరహాలో మున్సిపల్ అద్దె గదుల వసూళ్ల ఉంటే మున్సిపాలిటీ ఆదాయానికి తీవ్ర నష్టం వాటిల్లుతుండటం తప్ప లాభం లేదని పలువురు చెబుతున్నారు.

ప్రతి వార్డుకో సచివాలయం వున్నా...

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో మొత్తం 46 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 46 మంది వార్డు అడ్మిన్‌లు ఉన్నారు. ప్రతి సచివాలయంలో పది మంది వుంటే మొత్తం 500 మంది సచివాలయ సిబ్బంది వున్నా మున్సిపల్ ఇంటిపన్నుల, మున్సిపల్ అద్దె గదుల బకాయిల్లో ఎందుకు ఇంత నిర్లక్ష్యం వహిస్తున్నారో అధికారులకే తెలియాలి. నెలనెల ప్రతి సచివాలయ పరిధిలో అడ్మిన్‌లకు బాధ్యత అప్పగించాలి. వారు అద్దెలు వసూళ్ల చేయకపోతే చర్యలు తీసుకునేలా మున్సిపల్ రెవెన్యూ అధికారి, కమిషనర్ వ్యవహరించాలి. కానీ వందలాది మంది సిబ్బంది వున్నా అద్దెలు, పన్నుల వసూళ్లలో అధికారుల సమన్వయ లోపం, నిర్లక్ష్యం కారణంగా మున్సిపాలిటీ ఆదాయానికి గండిపడుతోంది. కాగా మున్సిపాలిటీలో మొత్తం 119 అద్దె గదులు వుంటే.. అందులో 22 ఖాళీగా వుంటే ప్రతి నెల ఎంత ఆదాయం మున్సిపాలిటీ నష్టపోవాల్సి వస్తుందో అధికారులకు తెలిసినా వాటిపై దృష్టి సారించడం లేదని ఆరోపణలున్నాయి.

ఏడాదికి రూ.1.30 కోట్లు ఆదాయం

మున్సిపల్ అద్దె గదుల ద్వారా ప్రతి ఏడాది నెలకు రూ.1.30 కోట్ల మేర ఆదాయం వచ్చేది. నేడు ఆ ఆదాయానికి గండి పడుతోంది. ఇప్పటికైనా రెవెన్యూ సెక్షన్ అధికారులు మేల్కొని.. మున్సిపల్ అద్దె గదులకు సక్రమంగా వసూళ్ల చేయడంతో పాటు ఖాళీగా వున్న వాటికి వేలం వేయాల్సి ఉంది.



కామిశెట్టి సుబ్బారావు మున్సిపల్ కాంప్లెక్స్



సిరిపురి మున్సిపల్ కాంప్లెక్స్

అద్దె వసూళ్లపై ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

మున్సిపల్ అద్దె గదులకు సంబంధించి బకాయిల వసూళ్లలో ప్రత్యేక చర్యలు తీసుకుం టాం. వార్డు సచివాలయ సిబ్బందిని టీంలుగా వేసి నెలనెల అద్దెలు వసూళ్ల అయ్యేలా చేస్తాం. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఖాళీ గదులకు వేలం వేస్తున్నా ముందుకు రావడం లేదు. వెంట వెంటనే గదులకు వేలం వేసి అద్దెలకు ఇస్తాం. మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడే ఏ చర్యలను ఉపేక్షించం.

- రఘునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు

302 మంది పంచాయతీ సెక్రటరీల బదిలీలు

కడప రూరల్, అక్టోబర్ 4: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలలోని వివిధ క్యాడర్లకు సంబంధించి 302 మంది పంచాయతీ సెక్రటరీలను శుక్రవారం డీపీవో బదిలీ చేశారు. వీరిలో 48 మంది గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 4 క్యాడర్‌కు చెందిన పంచాయతీ సెక్రటరీలు ఉండగా, 99 మంది గ్రేడ్ 5 క్యాడర్‌కు చెందిన సెక్రటరీలు, 87 మంది గ్రేడ్ 6 క్యాడర్‌కు చెందిన డిజిటల్ అసిస్టెంట్లతో పాటు మరో 68 మందిని రిక్వెస్ట్ ద్వారా బదిలీ చేశారు. వీరితో పాటు 13 మంది ఈవోపీఆర్‌డీలను, ఇద్దరు డీఎల్‌పీవోలను బదిలీ చేశారు. ఈ మేరకు వారికి కేటాయించిన స్థానాలలో శనివారం బాధ్యతలను చేపట్టనున్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 4 : విద్యార్థులు నైపుణ్యాలను అందిపుచ్చుకుని నిష్ణాతులుగా తయారు కావాలని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాథకుమార్ తెలిపారు. శుక్రవారం శిక్షణ పొందుతున్న విద్యార్థుల వద్దకు వెళ్లి జరుగుతున్న శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. నిపుణులైన అధ్యాపకులు అందించే శిక్షణ, జ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని.. ఎప్పటికప్పుడు జ్ఞానాన్ని అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రేమ్‌సమీర్ పాల్గొన్నారు.

ఆదర్శనీయం మీ సేవలు : వీసీ



మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 4: సమాజసేవలో మీ మార్గం అనుసరణీయం, ఆదర్శనీయమని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు కె.క్రిష్ణారెడ్డి అన్నారు. ఎన్ఎస్ఎస్ 2023-24 విద్యాసంవత్సరానికి యూనివర్శిటీ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అన్న మహాకవి గురజాడ మాటలు అందిపుచ్చుకుని దేశ సౌభాగ్యం కోసం పాటుపడాలని సూచించారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా అందిస్తున్న సేవలు నిరుపమానమన్నారు. అనంతరం ఉత్తమ అధికారులకు సత్కారం చేశారు.

ప్రొద్దుటూరులో ఆర్వీ టూర్స్ అండ్ ట్రావెల్స్



ఆర్వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, అక్టోబరు 4: ప్రొద్దుటూరు గ్రౌండ్‌లో శుక్రవారం ఆర్వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ యజమాని ఆర్వీ రమణ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం దాదాపు రెండు దశాబ్దాలుగా 100కు పైగా అనేక దేశీయ, విదేశీయ టూర్లను అందిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చక్కటి సౌకర్యాలతో ఎన్నో ప్యాకేజీలు రూపొందించామన్నారు. ప్రముఖంగా కాశీ-అయోధ్య, బ్యాంకాక్ టూర్లను అతి తక్కువ ధరలలో అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నేడు పీఎం కిసాన్ నిధులు విడుదల

- జిల్లాలో 1,73,591 రైతులకు రూ.34.72 కోట్లు జమ

రాయచోటిటౌన్, అక్టోబరు 4: భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ 18వ విడత పీయం కిసాన్ నిధులను శనివారం ఉదయం 11.30 గంటలకు మహారాష్ట్ర నుంచి విడుదల చేయనున్నారని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో 1,73,591 రైతులకు గాను రూ.34.72 కోట్లు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ పీయం కిసాన్ నిధులు విడుదల కార్యక్రమం ప్రతి రైతు సేవా కేంద్రంలోని స్మార్ట్ టీవీలో లైవ్ టెలికాస్ట్ చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు, రైతులందరూ ఈ కార్యక్రమాన్ని తమ రైతు సేవా కేంద్రం నుంచి వీక్షించాలని ఆయన తెలియజేశారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధుడు మృతి

కొండాపురం, అక్టోబరు 4: మండలంలోని తాళ్లపొద్దుటూరు గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య (77) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి వివరాల మేరకు... వెంకటసుబ్బయ్య గురువారం సాయంత్రం తాళ్లప్రొద్దుటూరు-జోగాపురం పాత మట్టిరోడ్డులో వాకింగ్‌కు వెళ్లాడు. అక్కడ గుండెపోటుకు గురై మృతి చెందినట్లు వారి బంధువులు ఫిర్యాదు చేశారన్నారు. గండికోట బ్యాక్‌వాటర్ పక్కనే మృతదేహం ఉండటంతో మరే ఇతర కారణంతో మృతి చెందడా అని తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్థలం విషయమై ఇరువర్గాల ఘర్షణ

- టీడీపీ కార్యకర్తలకు గాయాలు

మైలవరం, అక్టోబరు 4: మండల పరిధిలోని చిన్నవెంతుర్ల గ్రామంలో శుక్రవారం ఇంటి వద్ద కలందొడ్డి స్థలం విషయమై ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. పోలీసులు, బాధితులు వివరాల మేరకు.. గ్రామంలో గత కొన్నేళ్లుగా వీరి మధ్య స్థలం వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో టీడీపీ కార్యకర్తలైన తండ్రి కుమారులు చేరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కేశవరెడ్డి, వైసీపీ వర్గానికి చెందిన మౌలాలిరెడ్డి, నరసింహారెడ్డి, వెంకటేశ్వరరెడ్డితో పాటు మరో ఏడుగురు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో గొడ్డలి, కర్రలతో చంద్రశేఖర్‌రెడ్డి, కేశవరెడ్డిలపై దాడికి పాల్పడటంతో రక్తగాయాలయ్యాయి. వెంటనే వారిని జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి డాక్టర్లు ప్రొద్దుటూరుకు రెఫర్ చేశారు. ఘర్షణకు సబంధించి ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తలమంచిపట్నం పోలీసులు తెలిపారు.

గంగమ్మ ఆలయంలో చోరీ

జమ్మలమడుగు, అక్టోబరు 4: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు గ్రామం గంగమ్మ దేవాలయంలో శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. అమ్మవారికి అలంకరించిన వెండికిరీటాన్ని చోరీ చేశారు. ఆలయ పూజరుల వివరాల మేరకు... నాలుగు నెలల క్రితం ఓ భక్తుడు అమ్మవారికి ఒకటిన్నర లక్ష విలువచేసే వెండి కిరీటం బహూకరించారు. దసరా పండుగను పురష్కరించుకుని నవరాత్రుల రెండవ రోజు గంగమ్మ అమ్మవారికి శుక్రవారం ఉదయం వెండికిరీటం అలంకరించి పూజలు నిర్వహించామన్నారు. ఇంటికి వెళ్లి మధ్యాహ్నం 12.30 గంటలకు ఆలయం వద్దకు వెళ్లి చూడగా.. గుర్తు తెలియని వ్యక్తులు గేటు తాళం పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించి వెండికిరీటాన్ని చోరీ చేశారు. ఈ విషయం స్థానిక అర్బన్ పోలీసులకు తెలపడంతో వారు ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు పూజారులు తెలిపారు.

13 దుంగలు స్వాధీనం

రాజంపేట, అక్టోబరు 4: అక్రమంగా తరలిస్తున్న 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు సిద్దవటం ఎఫ్ఆర్వో కళావతి తెలిపారు. శుక్రవారం డీఆర్వో కె.ఓబులేశు, సిబ్బందితో కలసి తనిఖీలు చేపట్టగా.. ఎద్దులగుండాల ప్రదేశంలో స్మగర్లు కనిపించడంతో పట్టుకోవడానికి ప్రయత్నించగా పారిపోయారన్నారు. అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉన్న 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ తనిఖీలో సిద్దవటం ఎఫ్‌బీవో పెంచలరెడ్డి, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

కమలాపురం రూరల్, అక్టోబరు 4: మండలంలోని జంగంపల్లె ఎస్సీ కాలనీకి చెందిన రామసుబ్బయ్య (73) జీవితంపై విరక్తితో గురువారం మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. రామసుబ్బయ్య కొన్నాళ్లుగా అనారోగ్యానికి గురయ్యాడు. బంధువులు ఆసుపత్రికి తీసుకెళ్లి చూపించగా అవయవాలు దెబ్బతిన్నాయని చెప్పగా ఇంటివద్దనే ఉంచారు. దీంతో ఆ వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది గురువారం సాయంత్రం ఇంట్లోనే మద్యంలో పురుగు మందు కలిపి తాగాడు. గమనించిన కుటుంబీకులు కడప సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అవుట్‌పోస్టు పోలీసులు సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గాలివాన బీభత్సం

- విరిగిన విద్యుత్ స్తంభాలు ● దెబ్బతిన్న పంటలు

చెన్నూరు / వేంపల్లి, అక్టోబరు4: చెన్నూరు మండలంలో గురువారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు వీచిన గాలులతో కురిసిన వర్షంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోగా వాటిపై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు కిందపడ్డాయి. దీంతో బాగా నష్టం జరిగిందని ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి తెలిపారు. గాలివాన వల్ల విమానశ్రయ ప్రాంతంలో మూడు విద్యుత్‌స్తంభాలు విరిగాయని, పలు విద్యుత్‌స్తంభాలు ఒరిగాయన్నారు. అలాగే శాటిలైట్‌సిటీ ప్రాంతంలో సైతం విద్యుత్‌స్తంభాలు విరిగాయి. కొండపేట ఉమామహేశ్వర ఆలయం సమీపంలో 7 విద్యుత్ స్తంభాలు విరిగాయి. విద్యుత్ స్తంభాలు కూలిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది.



కొండపేటలో విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మరు



అలిరెడ్డిపల్లె వద్ద పూర్తిగా నేలవాలిన వరిపంటను చూపుతున్న రైతు

నేలకొరిగిన వరిపంట

వేంపల్లె మండలంలో గాలివానకు పలుపంటలు దెబ్బతిన్నాయి. గురువారం రాత్రి ఉన్నట్లుండి వీచిన గాలులు, కురిసిన వర్షానికి వేంపల్లె, అలిరెడ్డిపల్లె, తువ్వపల్లె, కుమ్మరాంపల్లె వీరన్నగట్టుపల్లె, ఇడుపులపాయ గ్రామాల్లో వరి పంట దెబ్బతింది. కొన్నిచోట్ల పంట మొత్తం నేలవాలింది. లక్షలాది రూపాయలు ఖర్చుచేసి కొద్దిరోజుల్లో కోతకు వస్తున్న వరి కళ్లముందే దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇడుపులపాయ, వీరన్నగట్టుపల్లె ప్రాంతాల్లో సన్ననిమ్మచెట్లు నేలకొరిగాయి. నేలవాలిన వరిపంటను మండల వ్యవసాయాధికారి రాజేంద్రప్రసాద్ పరిశీలించారు.

బాధ్యతాయుతంగా పనిచేసి మంచి పేరు తేవాలి

కడప(కలెక్టరేట్), అక్టోబరు 4: బదిలీ అయిన అధికారులు జిల్లాలో బాధ్య తాయుతంగా పనిచేశారని, అదే స్ఫూర్తితో బదిలీపై వెళ్లే ప్రాంతాల్లో పనిచేసి జిల్లాకు మంచి పేరు తేవాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబరులో కలెక్టర్ అధ్యక్షతన బదిలీ అయిన అధికారులకు ఆత్మీయ అభినందన వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బదిలీ అయిన అధికారులు తనతో పనిచేసిన కాలంలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా బాధ్యతాయుతంగా పనిచే శారన్నారు. జిల్లా నుంచి బదిలీ అయిన 8 మంది అధికారులు జమ్మల మడుగు ఆర్డీవో శ్రీనివాసులు, పులివెందుల ఆర్డీవో వెంకటేష్, స్పెషల్ కలెక్టర్ కౌసరుభాను, మున్సిపల్ కమిషనరు వైవీ నందన్, జడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటసుబ్బయ్యలతో జిల్లాలో పనిచేసిన అనుభవాలు చాలా ఉన్నాయన్నారు. తనకు అన్ని విధాల సహకరించారంటూ ధన్యవాధాలు తెలిపారు. అనంతరం తోటి అధికారులతో పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు. తదనంతరం బదిలీపై వెళుతున్న జిల్లా అధికారులు కలెక్టర్ శివశంకర్‌ను దుశ్శాలువతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో గంగాధర గౌడ్, సీపీవో వెంకట్రావు, అధికారులు సరస్వతి, సురేష్‌కుమార్, శ్రీలక్ష్మి, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



బదిలీ అయిన అధికారులతో కలెక్టర్ శివశంకర్

వణ్య ప్రాణ వారోత్సవాల పోస్టర్ విడుదల

వణ్యప్రాణి వారోత్సవాల గోడపత్రాలను కలెక్టర్ శివశంకర్, జిల్లా అటవీశాఖ అధికారి సందీప్‌రెడ్డిలు శుక్రవారం ఆవిష్కరించారు. శుక్రవారం కలెక్టర్ చాంబరులో జరిగిన ఈకార్యక్రమంలో అటవీశాఖాధికారులు పాల్గొన్నారు.

వివేకా హత్యకేసులో సునీల్ యాదవ్ బెయిల్‌పై విడుదల

సైదాబాద్,అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి వై.ఎస్.వివేకానందారెడ్డి కేసులో నిందితుడు సునీల్ యాదవ్ శుక్రవారం సాయంత్రం బెయిల్‌పై విడుదలయ్యారు. గురువారం సునీల్ యాదవ్‌కు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. గత రెండేళ్లుగా సునీల్ యాదవ్ జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఇదే కేసులో మరో ఇద్దరు నిందితులు గంగిరెడ్డి, శంకర్ రెడ్డి జైలులో ఉన్నారు.

కడుపు నొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య



సింహాద్రిపురం, అక్టోబరు 4: మండలంలోని గురిజాల గ్రామంలో కడుపు నొప్పి తాళలేక రామశేఖర (46) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. గురిజాల గ్రామ సమీపంలో రామశేఖర వేపచెట్టుకు లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు కలరు. మృతుని భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ హాజీవలి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

పిడుగుపాటుకు ఆవు, కోడెదూడ మృతి

సింహాద్రిపురం, అక్టోబరు 4: మండలంలోని బి.చెర్లోపల్లెలో శుక్రవారం పిడుగుపాటుతో ఆవు, కోడెదూడ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు అన్నవరం సతీష్‌కుమార్‌రెడ్డి సమాచారం మేరకు.. ఆవు, కోడెదూడలను గడ్డి మేత కోసం పొలం వద్దకు తోలుకెళ్లాడు. అదే సమయంలో వర్షం కురవడంతో ఇంటికి తోలుకుని వస్తుండగా పిడుగుపాటుకు ఆవు, కోడెదూడ మృత్యువాత పడ్డాయని తెలిపాడు. రూ.2లక్షలు విలువ చేసే ఆవు, కోడెదూడ మరణించడంతో తనకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు సతీష్‌కుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని కోరారు.

అరవీడు పంచాయతీలో ఆవు మృతి

గాలివీడు, అక్టోబరు 4: మండలంలోని అరవీడు గ్రామ పంచాయతీ శ్రీనగర్ కాలనీలో గురువారం రాత్రి పిడుగు పడటంతో ఆవు మృతి చెందింది. పాడి ఆవును నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని.. ఆవు చనిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు లక్ష్మీదేవి కోరారు.

ఘర్షణలో వ్యక్తి మృతి



కమలాపురం రూరల్, అక్టోబరు 4: మండల పరిధిలోని అప్పారావుపల్లెలో దారి విషయమై జరిగిన ఘర్షణలో రామకృష్ణారెడ్డి అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు సమాచారం మేరకు... అప్పారావుపల్లెకు చెందిన శీలం రామక్రిష్ణరెడ్డి, యల్లారెడ్డి, విశ్వనాధ్‌రెడ్డి పొలాల పక్కపక్కనే ఉన్నాయి. వీరి పొలాలకు అదే గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి పొలం ఉంది. శంకర్‌రెడ్డి తన పొలంలోకి వెళ్లేందుకు యల్లారెడ్డి, విశ్వనాధరెడ్డిలు అడ్డగిస్తున్నారు. రామక్రిష్ణారెడ్డి వేరే దారి గుండా వెళ్లాలని పంచాయతీ చేసి దారి ఏర్పాటు చేయడంతో వీరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. అయితే శుక్రవారం మాకు తెలియకుండా శంకర్‌రెడ్డికి దారి ఏర్పాటు చేస్తావా అంటూ ఘర్షణకు దిగారు. రామక్రిష్ణారెడ్డి వారిని వారిస్తుండగా ఒక్కసారిగా తోసారు. దీంతో అతను స్పృహ తప్పి పడిపోయాడు. అయితే రామక్రిష్ణారెడ్డి కొద్దిరోజుల క్రితమే గుండెకు స్టంట్ వేయించుకుని ఉన్నాడు. కింద పడిపోయిన రామక్రిష్ణారెడ్డిని బంధువులు హుటాహుటిన కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కాగా, రామకృష్ణారెడ్డి మృతదేహాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పరిశీలించి సంతాపం తెలిపారు.

రాయచోటి ఏరియా ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



రాయచోటిటౌన్, అక్టోబరు 4: రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం ఆసుపత్రి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సలో చేసి మహిళ కడుపులో నుంచి 4 కిలోల కణతిని తొలగించారు. రాయచోటి మండల పరిధిలోని యండపల్లి హరిజనవాడకు చెందిన శకరమ్మ తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతూ రాయచోటి ఏరియా ఆస్పత్రికి వచ్చింది. మహిళను పరీక్షించిన వైద్యులు మహేశ్వర్‌రాజు, అనిల్, వెంకటశివ బృందం మహిళకు ఆపరేషన్ నిర్వహించి ఆమె కడుపు నుంచి నాలుగు కిలోల గడ్డను విజయవంతంగా తొలగించారు. ఆపరేషన్ అనంతరం రోగి ఆరోగ్యంగా ఉండడంతో మహిళ బంధువులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌ను కలిసిన తంబళ్లపల్లె టీడీపీ నేతలు



రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌తో రాజంపేట పార్లమెంటరీ తెలుగుయువత ప్రధానకార్యదర్శి అయూబ్‌బాషా, యువగళం టీం సభ్యులు

కురబలకోట, అక్టోబరు 4: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ రవినాయుడును తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు కలిశారు. శుక్రవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఆయన ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను కలిసి అభినందనలు తెలియజేసి దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం కురబలకోట మండలం అంగళ్ళు, ముదివేడు జడ్పీ హైస్కూల్‌కు క్రీడామైదానాన్ని మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ తెలుగుయువత ప్రధానకార్యదర్శి అయూబ్ బాషా, యువగళం టీం సభ్యులు శ్రీనివాసురాజు, మురళి పాల్గొన్నారు.

టీడీపీ అధ్యక్షుడిని కలిసిన పర్వీన్‌తాజ్



టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పర్వీన్‌తాజ్

బి.కొత్తకోట, అక్టోబరు 4: రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ఎం పర్వీన్‌తాజ్ శుక్రవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహణ తీరుపై వారు ఆరా తీసినట్లు ఆమె పేర్కొన్నారు.

స్వర్ణాంధ్ర నమోదులో ముందుంటాం

కురబలకోట, అక్టోబరు 4: స్వర్ణాంధ్ర 2047లో నమోదులో ముందుంటామని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం డీవైఈవో శ్రీరామ్ పురుషోత్తం కలిసి ప్రతి విద్యార్థి, సిబ్బందిని తప్పనిసరిగా నమోదు చేయడానికి సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్, ఎంఈఓలు ద్వారకనాథ్, రెడ్డిశేఖర్, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో డీఎస్పీ విచారణ



బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్

పీలేరు, అక్టోబరు 4: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును శుక్రవారం రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్ విచారించారు. పీలేరు పట్టణం బండ్లవంకకు చెందిన కృష్ణా నాయక్, అతని భార్య నీలావతమ్మ తమను అదే ప్రాంతానికి చెందిన కె.రవి, కె.నాగరత్నమ్మ, వారి కుమార్తె కవిత కులం పేరుతో దూషించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు అప్పట్లో పీలేరు పోలీసులు కేసు నమోదు చేశారు. రాయచోటి డీఎస్పీ శుక్రవారం బాధితులను పరామర్శించి, సంఘటనా స్థలాన్ని పరిశీలించి వారి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఎస్ఐ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆటో, ద్విచక్రవాహనం ఢీ ముగ్గురికి గాయాలు

తంబళ్లపల్లె, అక్టోబరు 4: ఆటో, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా, ఓ మహిళకు స్వల్ప గాయాలైన సంఘటన శుక్రవారం తంబళ్లపల్లెలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబీకుల వివరాల మేరకు.. మండలంలోని కోసువారిపల్లెకు చెందిన ఫకృద్దీన్(30), షబానా దంపతులు వ్యవసాయ పనులు ముగించుకుని వారి ఆటోలో ఇంటికి బయలుదేరారు. ఇదే సమయంలో రామాపురంకు చెందిన వినో ద్(24) తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రిలో జీడీఏ(జనరల్ డ్యూటీ అటెండర్)సొంత పనుల నిమిత్తం మదనపల్లెకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా మూలపల్లె సమీపంలో చింతతోపు వద్ద వారి వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో వినోద్, ఆటో నడుపుతున్న ఫకృద్దీన్‌కు తీవ్ర గాయాలవ్వగా.. షబానా స్వల్పంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా వినోద్‌కు మెరుగైన చికిత్స అవసరమవ్వడంతో మదనపల్లెకు తరలించారు.


యువకుడు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, అక్టోబరు4: మదనపల్లె మండలం, పోతబోలుకు చెందిన మహబూబ్‌బాషా అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహిస్తూ వ్యాపార నిమిత్తం రెండు లక్షలు అప్పులు చేసిను మహబూబ్‌బాషా రుణగ్రస్తుల నుంచి ఒత్తిడి రావడంతో మనుస్థాపానికి గురై శుక్రవారం విషం తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడన్నారు. కుటుంసభ్యులు గమనించి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారని ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

జూదం ఆడుతున్న ఐదుగురు అరెస్టు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 4: జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. శుక్రవారం స్థానిక నీరుగట్టువారిపల్లెలోని కాట్లాటపల్లె రోడ్డులో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో వన్‌టౌన్ ఎస్ఐ అన్వర్ బాషా తమ సిబ్బందితో అక్కడికి వెళ్లి ఐదుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ చెప్పారు.

నాణ్యతగా వాటర్‌షెడ్ పనులు చేపట్టాలి



వాటర్‌షెడ్ పనులను పరిశీలిస్తున్న జేఈ విశ్వనాథ్

నిమ్మనపల్లి, అక్టోబరు 4: మండలంలోని మూడు పంచాయతీల్లో వాటర్‌షెడ్ కింద జరుగుతున్న పనులను నాణ్యతగా చేపట్టాలని జేఈ విశ్వనాథ్, టీవో ధర్మేంద్ర సూచించారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు వాటర్‌షెడ్ పనులను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం మూడు పంచాయతీలకు గానూ రూ.43లక్షలు వచ్చినట్లు తెలిపారు. అనంతరం ముష్టూరులో వాటర్‌షెడ్ కింద జరుగుతున్న నీటి కుంటలను పరిశీలించి పనులకు నాణ్యతగా చేపట్టాలని సూచించారు.

ప్రశ్నార్థకంగా వేరుశనగ సాగు..!

● ఏటేటా తగ్గుతున్న పంట సాగు విస్తీర్ణం ●వందల ఎకరాలకు పడిపోయిన వైనం ● ఆందోళనలో అన్నదాతలు



రామాపురం వద్ద ఎండుతున్న వేరుశనగ పంట

గుర్రంకొండ, అక్టోబరు 4:పడమటి మండలాల్లో వేరుశనగ పంట సాగు ప్రశ్నార్థకంగా మారుతోంది. దీంతో ఏటేటా సాగు విస్తీర్ణం తగుతుండడమే కాకుండా వేరుశనగ పంట సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. గత ఏడాది వెయ్యి ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేసిన రైతులు సకాలంలో వర్షాలు కురవక, ఒకవేళ కురిసిన అతివృష్టితో పంటలు దెబ్బతింటుండడం కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో ఈ ఏడాది వందల ఎకరాలకు పంట సాగు పడిపోయింది. ఈ ఏడాది మే, జూన్ మాసాల్లో వర్షం కురవడంతో పంట బాగా పండుతుందని కోటి ఆశలతో రైతన్నలు వేరుశనగ పంటను సాగు చేశారు. పంట సాగు మొదట్లో వర్షాలు పడడంతో పంట ఏపుగా పెరిగింది. అయితే పూత, పిందె దశలో వర్షం ముఖం చాటేయడంతో వేరుశనగ పంటలో కాయలు నాణ్యత లేక బుడ్డలుగా మారాయి. వర్షం లేక భూమి గట్టిగా మారడంతో వేరుశనగ చెట్లు ఎండిపోయాయి. చెట్లలో ఉన్న కాయలు బయటకు తీయడానికి రైతన్న పడరాన్నిపాట్లు పడుతున్నారు. ప్రతి ఏటా వరుణుడు సకాలంలో కురవకపోవడంతో రైతన్నలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పంట సాగు చేసి నష్టాలు తప్ప ప్రయోజనం లేదంటూ అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుర్రంకొండ మండలంలో 6037 ఎకరాల్లో 2818 మంది రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో 2684 ఎకరాల్లో 1017 మంది రైతులు వేరుశనగ పంటను సాగు చేసేవారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో వేరుశనగ పంట విస్తీర్ణం ఏటేటా తగ్గిపోతూ వస్తుంది. ఈ ఏడాది మండలంలో 15 పంచాయతీల్లోని 175 గ్రామాల్లో రైతులు వేరుశనగ పంట సాగు చేయడానికి ప్రభుత్వం సబ్సిడీపై 1300 కింటాళ్ల వేరుశనగ విత్తనకాయలను 1500 ఎకరాల్లో సాగు చేయడానికి ఇచ్చింది. ఈ క్రమంలో మండలంలోని అన్ని గ్రామాల్లో కేవలం 876 ఎకరాల్లో పంట సాగు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతుండగా క్షేత్ర స్థాయిలో విస్తీర్ణం అందులో సగం కూడా లేదని రైతులు అంటున్నారు. అధికారులు స్పందించి కనీసం బోర్ల కింద వేరుశనగ పంట సాగుకు అవసరమైన రాయితీ అందజేసి రైతులను ప్రోత్సహిస్తే బాగుంటుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

నష్టాలు.. అడవి పందుల బెడద

ప్రభుత్వం ప్రతి ఏటా రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తనకాయలు అందజేస్తున్నా పంట సాగులో నష్టాలను, చవిచూసి చాలా మంది సాగు చేయడం మానేశారు. ఇలా పంట సాగు విస్తీర్ణం తగ్గడానికి మరో కారణంగా చెప్పవచ్చు. వేరుశనగ పంట సాగుకు అడవి పందుల బెడద ఎక్కువగా ఉంది. దీంతో రైతన్నలు వేరుశనగ పంట సాగుపై ఆసక్తి చూపడం లేదు. పంట సాగు నుంచి దిగుబడి వచ్చే సమయం వరకు కంటికి రెప్పలా కాపాడుకున్నా ప్రయోజనంలేదంటూ రైతులు పేర్కొంటున్నారు. దీనికి తోడు నెమళ్ల దాడి కూడా ఎక్కువైందంటున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

మండలంలో వేరుశనగ పంట సాగుపై రైతులకు వ్యవసాయశాఖ సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో వేరుశనగ పంట విస్తీర్ణం పెరిగేలా తగు సూచనలు చేస్తున్నాం. వర్షాలు సరిగా కురవకపోవడంతో పంట సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. బోర్ల కింద వేరుశనగ పంటను రైతులు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

-రత్నమ్మ, వ్యవసాయాధికారిణి, గుర్రంకొండ, మండలం.

గాయత్రీదేవిగా కటాక్షించిన వాసవీమాత



గాయత్రీదేవి మదనపల్లె



అన్నపూర్ణాదేవి ములకలచెరువు




గాయత్రీదేవి పీలేరు



బాలాత్రిపురదేవి గుర్రంకొండ



మీనాక్షిదేవి వాల్మీకిపురం



గాయత్రిదేవి కలికిరి



దుర్గమ్మ మదనపల్లె



పసుపుగంగమ్మ మదనపల్లె

మదనపల్లె అర్బన్, అక్టోబరు4: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మదనపల్లె రెండో రోజైన శుక్రవారం వాసవీ కన్యకాపరమేశ్వరి గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మదనపల్లె పట్టణంలోని వాసవీభవన్ వీధిలో వాసవీ కన్యాకాపరమేశ్వరీ దేవికి మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో అమ్మవారిని గాయత్రిదేవి అలంకరణతో విశేషంగా పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మదనపల్లె ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్, ఉపాధ్యక్షుడు దేవతా సతీష్, కార్యదర్శి సూరేగిరిధర్ పాల్గొన్నారు. దేవతానగర్‌లోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవి అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని లలిత త్రిపురసుందరీదేవి అలంకరణ చేసి విశేషంగా పూజలు నిర్వహించారు. దేవళంవీదిలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ఆలయ ఈవో రమణ ఆధ్వర్యంలో మహాలక్ష్మీ అలంకరణ వైభవంగా నిర్వహించారు. అనపగుట్టలో ఉన్న అభయలక్ష్మీ నరసింహాస్వామి ఆలయంలో లక్ష్మీనరసంహుడికి కుంకుమ అలంకరణతో పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని నాగిరెడ్డివీధిలో జనసేన పార్టీ కార్యాలయంలో దుర్గమాతను ప్రతిష్ఠించి 9 రోజులపాటు పూజలు నిర్వహించి ఈ నెల 13న ఏకదశమి రోజు ఊరేగింపుగా వెళ్లి తట్టివారిపల్లె చెరువులో నిమజ్జనం చేస్తున్నట్లు నిర్వాహకులు విజయేంద్ర, నవాజ్, సోను, పూర్ణేష్, సత్య, దిపక్, దానేష్, స్వాహిల్ తెలిపారు. మండలంలోని కురవంకలోని భువనేశ్వరి ఆలయంలో దుర్గమాతకు విశేషపూజలు నిర్వహించారు. కోర్టులో వెలసిన గంగమ్మకు కుంకుమ అలంకరణ చేసి ఆలయకమిటీ అధ్యక్షుడు చిన్నరెడ్డెప్ప, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్‌నాయుడు, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్‌నాయుడు, కమిటీ సభ్యులు భక్తులకు దర్శనం కల్పించారు. నీరుగటగ్టువారిపల్లెలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో కుంకుమ అలంకరణ చేసి ఆలయకమిటీ అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్, కోశాధికారి రామిశెట్టి రత్నమయ్య, కార్యదర్శి పవన్‌కుమార్‌ల పర్యవేక్షణలో భక్తులకు అన్నదానం చేశారు.

ములకలచెరువులో: స్థానిక పీటీయం రోడ్డులో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు శుక్రవారం అన్నపూర్ణ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పీలేరులో: శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా శుక్రవారం పీలేరు గ్రామ దేవత రౌద్రాల అంకాళమ్మ గాయత్రి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నెహ్రూబజారులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారు గాయత్రీదేవిగా, మోడల్ కాలనీ వద్దనున్న ఎల్లమ్మ, ఇందిరమ్మ కాలనీ వద్దనున్న దిన్నె గంగమ్మలు బాలాత్రిపుర సుందరి అలంకారాల్లో దర్శనమిచ్చారు. దేవీ నవరాత్రులతోపాటు శుక్రవారం కూడా కలిసి రావడంతో మహిళలు అమ్మవార్లను పెద్దఎత్తున దర్శించుకున్నారు. ఆయా ఆలయాల నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండలం వ్యాప్తంగా దసరా శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. మండలంలోని సత్యమ్మతల్లి ఆలయంలో అమ్మవారు గాయత్రిదేవి గాను, స్థానిక కోనేటివీధి శివాలయంలో మీనాక్షి దేవిగాను, నల్లవీర గంగాభవానీ ఆలయంలో గాయత్రీదేవిగాను, బజారు వీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో పద్మావతి దేవిగాను, చింతపర్తి వాసవీ అమ్మవారి ఆలయంలో హరిద్రాదేవిగాను, గొల్లపల్లె విరూపాక్షమ్మ ఆలయంలో గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్యక్రమాలలో ఆలయాల ధర్మకర్తలు పులి సత్యారెడ్డి, కాంతరాజు, రమణారెడ్డి, కువైట్ శంకర, సతీష్ పాల్గొన్నారు.

గుర్రంకొండలో:గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మ అమ్మవారు బాలా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి విశేష పూజలను చేశారు. అనంతరం మహిళల చేత సామూహిక కుంకుమార్చనను చేయించారు. కార్యక్రమంలో ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

కలకడలో:మండలంలోని కోన గ్రామంలో వెలసిన చౌడేశ్వరి దేవి అమ్మవారు శుక్రవారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దసరా ఉత్సవాల్లో భాగంగా ఆయలంలో ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు.

కురబలకోటలో: దసరాశరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా కన్యకాపరమేశ్వరీ అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకరణలో శుక్రవారం దర్శనమిచ్చారు. కురబలకోట కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

కలికిరిలో: దసరా ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు స్థానిక గ్రామ దేవత ఎల్లమ్మ తల్లి గాయత్రీదేవి అలంకరణలో భక్తులను అలరించింది. ఉదయాన్నే విశేష పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ నిర్వాహకులు అశోక్‌కుమార్ రెడ్డి, మధుసూదన రెడ్డి, సురేంద్ర రెడ్డి భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

సౌకర్యాలతో రైతు బజార్‌ను సిద్ధం చేయండి

●మార్కెటింగ్‌శాఖ జేడీ రామాంజనేయులు



రైతుబజార్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేడీ రామాంజనేయులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 4: మదనపల్లె రైతు బజార్‌లో రైతులకు అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు సూచించారు. శుక్రవారం మదనపల్లె రైతుబజార్‌లో నిర్మిస్తున్న స్టాళ్లను, ఇతర పనులను జేడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం వస్తే రైతుబజార్‌లో వర్షపునీరు నిల్వ ఉంటోందని, అలా ఉండకుండా మట్టి తోలి చదును పనులు చేపట్టాలన్నారు. దీంతో పాటు రైతుబజార్ ప్రహరీ నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని ఏడీఎం త్యాగరాజుకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి కార్యదర్శి అభిలాష్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడిని పెంచాలి

మదనపల్లె టౌన్, అక్టోబరు 4: ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతు ఉత్పత్తి చేసే దిగుబడులను అదనంగా 15శాతం పెంచడమే లక్ష్యంగా రైతు సేవా కేంద్రం సిబ్బంది పనిచేయాలని డీఏవో చంద్రానాయక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీఎల్ఆర్సీ భవనంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో డివిజన్‌లోని ఆర్ఎస్‌కే సిబ్బంది, మండల ఏవోలు, ఎఫ్‌పీవోలకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ 2024-29 వ్యవధిలో జిల్లాలో తక్కువ ఖర్చుతో యాంత్రీకరణతో వ్యవసాయం చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దీని కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళిక రూపొందించామని, ఈ ప్రణాళిక ప్రకారం ఆర్ఎస్‌కే సిబ్బంది, ఏవోలు విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్సీ ఏడీఏ మజీద్‌అహ్మద్, ఏడీఏలు శివశంకర్, అశోక్‌రెడ్డి కేవీకేఎస్ శాస్త్రవేత్త సోమశేఖర్, ఏవోలు వెంకటమోహన్, రమేశ్‌రాజు, సుచిత్ర, తదితరులు పాల్గొన్నారు.

రైతుల వద్దనే మంచి శిక్షణ లభిస్తుంది

కలికిరి, అక్టోబరు 4: వ్యవసాయ విద్యార్థులకు రైతుల వద్ద నుంచే మంచి శిక్షణ లభిస్తుందని స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె.మంజుల తెలిపారు. మహానంది వ్యవసాయ కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులు మూడు నెలల క్షేత్ర స్థాయి శిక్షణ కోసం శుక్రవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ మాట్లాడుతూ పంటల సాగు గురించే కాకుండా రైతుల జీవన విధానాన్ని అధ్యయనం చేయాలని ఆమె సూచించారు.

నరసింహస్వామికి పవిత్రాలు సమర్పణ



గుర్రంకొండ, అక్టోబరు 4:గుర్రంకొండ మండలం తరిగొండ లక్ష్మీనరసింహస్వామి వారికి పవిత్రాల సమర్పణను వేదపండితులు వైభవంగా నిర్వహించారు. స్వామి వారి పవిత్రోత్సవాల్లో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి పవిత్ర మాలలకు ప్రత్యేక పూజలను చేసి స్వామి వారికి అలంకరించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోపినాథ్, ఆలయాధికారి కృష్ణమూర్తి, అర్చకులు , సిబ్బంది పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చట్టవిరుద్ధం

మదనపల్లె అర్బన్ అక్టోబరు 4: వైద్యశాలల్లో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్ట విరుద్ధమని డిప్యూటీ డీఎంహెచ్‌వో శిరోమణి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పతిలో ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్స్, స్కానింగ్ సెంటర్ల యాజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలల్లో, స్కానింగ్ సెంటర్లల్లో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్లు, స్కానింగ్ సెంటర్ల యాజమానులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జట్టుకు మిట్స్ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కురబలకోట, అక్టోబరు 4: మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు జేఎన్‌టీయూ బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో పురుషుల విభాగంలో డేటా సైన్స్ తృతీయసంవత్సరానికి చెందిన విద్యార్థి జీవన్, మహిళల విభాగంలో సీఎస్ఈ ఫైనలియర్‌కు చెందిన లక్ష్మి తనూజా, నిహితా కృష్ణలు, ప్రథమ సంవత్సరం ఏఐ విభాగానికి చెందిన వైష్ణవిలు అనంతపురం జేఎన్‌టీయూఏ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ సెలక్షన్ పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికయ్యా రన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ తదితరులు అభినందించారు.

మహిళలకు జీవనోపాధి రుణాల మంజూరే లక్ష్యం

●100రోజుల ప్రణాళికతో ఏపీఎంలు పనిచేయాలి ● డీఆర్‌డీఏ పీడీ



ఏపీఎంల సమావేశంలో సూచనలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

మదనపల్లె టౌన్, అక్టోబరు 4: ఎస్‌హెచ్‌జీ సభ్యురాలైన మహిళలకు జీవనోపాధి రుణాలు మంజూరు చేయడమే లక్ష్యంగా ఏపీఎంలు పనిచేయాలని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో డివిజన్‌లోని అన్ని మండలాల ఏపీఎంలు, సీసీలతో సమావేశంలో పీడీ మాట్లాడుతూ కేం ద్ర ప్రభుత్వం 2శాతం సబ్సిడీతో ఇచ్చే వుమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ రుణాలను మహిళలకు వ్యక్తిగతంగా మంజూరు చేయించాలన్నారు. జిల్లాలో 6,900 మందికి ఈ రుణాలు ఇప్పిం చడమే లక్ష్యంగా పెట్టుకుని ప్రతి మండలంలో కనీసం 200 మందికి రుణాలు మంజూరు చేయించాలన్నారు. రూ.లక్ష ఆపై మొత్తానికి రుణాలు ఇస్తారని, ప్రతి ఏపీఎం, సీసీలు వారి క్లస్టర్‌లో ఆసక్తి గల మహిళలను గుర్తించి, బ్యాంకు మేనేజర్లతో చర్చించి రుణాలు ఇప్పించాలన్నారు. డిసెంబరు 31వ తేది వరకు 100 రోజుల యాక్షన్ ప్లాన్‌పై ప్రతి నెలా సమావేశం నిర్వహిస్తామన్నారు. శ్రీనిధి రుణాలల్లో 100శాతం రికవరి చూపాలని సూ చించారు. సమావేశంలో డీపీఎం లక్ష్మీప్రసాదరెడ్డి, రమణ, వేణుమాధవ్, ఏపీఎం ఖిజర్ అహ్మద్, ఏసీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న గృహనిర్మాణాలను పూర్తి చేయాలి

పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 4 : జిల్లాలో అసంపూర్తిగా ఉన్న గృహనిర్మాణ పనులను డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేసేందుకు హౌసింగ్ సిబ్బంది కృషి చేయాలని జిల్లా హౌసింగ్ పీడీ శివయ్య ఆదేశించారు. శుక్రవారం హౌసింగ్ పీడీ పెద్దతిప్పసముద్రం మండలంలోని వివిధ గ్రామాల్లో గృహనిర్మాణ పనులను చేపడుతున్న పలు లేఔట్లను హౌసింగ్ ఏఈ శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దతిప్పసముద్రం మండలంలోని వివిధ గ్రామాలకు మొత్తం 2397 ఇళ్లను మంజూరు చేసినా ఇందులో గత ప్రభుత్వంలో లేఔట్లను గుట్టల్లో రోడ్డు సౌకర్యం లేకుండా ఉండడంతో అధిక శాతం మంది నిర్మాణాలను చేపట్టేందుకు ముందుకు రాలేదన్నారు. ఇప్పుడు ఇసుక కొరతతో నిర్మాణాలను చేపట్టలేక పోతున్నారని పలువురు లబ్ధిదారులు పీడీ దృష్టికి తీసుకు రావడంతో రెవిన్యూ అధికారులు, పోలీసులతో మాట్లాడి వెంటనే ఇసుకను చేరే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 79,721 ఇళ్లను మంజూరు చేయగా ఇందులో 46,561 ఇళ్లు పూర్తి కాగా, మోల్డింగ్ దశలో 31,065, గోడల దశలో 6,727, పునాదుల దశలో 22,065 గృహాలు ఉన్నాయన్నారు. ఇంకా నిర్మాణాలే ప్రారంభించని వారు 12,586 మంది ఉన్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వర్కు ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

రిజిస్ట్రేషన్లతో కిటకిటలాడిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



ప్రజలతో కిక్కిరిసి పోయిన మదనపల్లె సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

మదనపల్లె టౌన్, అక్టోబరు 4: ఇప్పటి వరకు మంచిరోజులు లేకపోవడం శుక్రవారం మంచి రోజు కావడంతో భూముల రిజిస్ట్రేషన్లకు ప్రజలు తరలి రావడంతో మదనపల్లె సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం జనంతో కిటకిటలాడింది. ఆస్తులు కొనుగోలు, విక్రయాలు చేసే వారు, సాక్షులు, దళారులు వెరసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి వృద్ధులు వచ్చేం దుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ వారంలో బుధ, గురువారాల్లో మంచి రోజులు కావని చాలా మంది శుక్రవారం(విదియరోజు) రిజిస్ట్రేషన్‌లు ఎక్కువగా పెట్టుకోవడంతో పాటు ఇక్కడ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ రాజు బదిలీపై వెళ్లిపోతుండటంతో ఆయన హయాంలోనే ఎలాంటి కొర్రీలు లేకుండా రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేయించాలని చాలా మంది దళారులు రంగంలోకి దిగారు. దీంతో కార్యాలయం కిక్కిరిసి పోయింది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రజలకు మర్యాదగా పలకరించాలని, తాగునీరు, టీ, కాఫీలు ఇవ్వాలని రాష్ట్ర రిజిస్ట్రేషన్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి సిసోడియా ఇచ్చిన ఉత్తర్వులు మదనపల్లెలో మాత్రం అమలు కావడం లేదు.

సబ్‌రిజిస్ట్రార్‌గా గురుస్వామి బాధ్యతలు స్వీకరణ



మదనపల్లె టౌన్, అక్టోబరు 4: జిల్లాలో ఏ గ్రేడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంగా గుర్తింపు పొందిన మదనపల్లె సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి మూడేళ్ల తరువాత రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్‌గా గురుస్వామి బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం పాకాల నుంచి బదిలీపై వచ్చిన గురుస్వామి మదనపల్లె సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సత్వర సేవలు అందిస్తామని, నిబంధనల ప్రకారం త్వరగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడమే కాక, దళారి వ్యవస్థను రూపుమాపుతామన్నారు. కాగా మదనపల్లె సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ వర్గం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పెత్తనం చెలాయించడం, వారు చెప్పిందే వేదంగా శాసిస్తుండటంతో మూడేళ్లగా ఏ ఒక్కరు కూడా రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించేందుకు ముందుకు రాలేదు. దీంతో ఈ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రాజు ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించారు. ఈ క్రమంలో సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన గురుస్వామి ఈ సమస్యలన్నింటిని అధిగమించి, సత్తా చూపుతారని ఆశిద్దాం.

చిన్నారి అస్పియా హత్య దోషులకు ఉరి శిక్ష విధించాలి



సబ్‌కలెక్టరేట్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు, మద్దతిచ్చిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, అక్టోబరు 4: చిత్తూరు జిల్లా పుంగనూరులో చిన్నారి అస్పియాను కిడ్నాప్ చేసి, హత్య చేసిన దోషులకు ఉరి శిక్ష విధించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ముస్లిం మైనారిటీలు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జామియా మసీదు నుంచి సబ్‌కలెక్టరేట్ వరకు ముస్లింలు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సబ్‌కలెక్టరేట్‌కు చేరుకున్న ర్యాలీకి మద్దతుగా పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ పుంగనూరులో అస్పియా హత్య ఘటనపై చిత్తూరు ఎస్పీతో చర్చించానన్నారు. ఈ హత్య వెనుక వున్న దోషులను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. పోలీసులు కూడా బాధ్యతగా కేసు ధర్యాప్తు చేస్తున్నారన్నారు. . రెండు రోజుల్లో ఈ హత్య కేసును పోలీసులు ఛేధిస్తారని ఆశిస్తున్నామన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతి పత్రం అందజేశారు.

వాల్మీకిపురంలో: చిన్నారి అస్పియా హత్య ఉదంతం బాధాకరమని వాల్మీకిపురం జేఏసీ విచారం వ్యక్తం చేసింది. శుక్రవారం రాత్రి వాల్మీకిపురంలో అస్పియా మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కొవ్వొత్తులతో పట్టణ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ వద్ద చిన్నారి అస్పియా మరణానికి కారకులు ఎవరైనా సరే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, అన్ని మతాల పెద్దలు, ప్రజలు, యువత పాల్గొన్నారు.

కలకడలో: పుంగనూరులో చిన్నారి అస్పియా మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించి చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని కలకడలోని ముస్లింలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అస్పియా మృతిని నిరసిస్తూ కలకడలోని ముస్లింలు శుక్రవారం సాయంత్రం స్థానిక బిలాల్ మసీదు నుంచి బస్టాండు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి అక్కడ కొవ్వొత్తులు వెలిగించి అస్పియా ఆత్మకు శాంతి కలగాలని నివాళులర్పించారు.

ప్రజలకు నాణ్యమైన రుచులు అందించండి



మయూర బేకరి, స్వీట్స్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, అక్టోబరు 4: మదనపల్లె ప్రజలకు నాణ్యమైన రుచికరమైన స్వీట్లు, బేకరి పదార్థాలు విక్రయించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బెంగళూరు బస్టాండులో మయూర బేకరి, స్వీట్స్ దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ మదనపల్లె ప్రజలకు కేరళ రుచులతో స్నాక్స్, స్వీట్లు, ఫ్రూట్ జ్యూస్, టీ, ఒకే చోట దొరికేలా ఈ దుకాణం ఏర్పాటు చేశారన్నారు. దుకాణం నిర్వాహకులు షాజిద్‌బాలన్ మాట్లాడుతూ ప్రజలకు అన్ని రకాల స్వీట్లు, బేకరి ఐటెమ్స్ అందుబాటు లోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఖాదర్‌కుట్టీ, ఆలీ, హరి, టీడీపీ నాయకులు విద్యాసాగర్, ఎస్ఏ మస్తాన్, సుధాకర్, బాలుస్వామి, గాంధీ, మల్లికార్జున పాల్గొన్నారు.

7 నుంచి తపాలా శాఖ జాతీయ వారోత్సవాలు

పీలేరు, అక్టోబరు 4: తపాలా శాఖ జాతీయ వారోత్సవాలు ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పీలేరు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా 7న పోస్టల్ మెయిల్ సర్వీసుపై సమావేశం, 8న స్టాంపుల సేకరణపైన, 9న , మొక్కలు నాటే కార్యక్రమం, 10న ఐపీపీబీ సేవలపై అవగాహన సదస్సు, 11న పోస్టల్ శాఖ సేవలపై అవగాహన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

15లోగా స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్



సమావేశంలో సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 4:ఈ నెల 15లోపు స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు.జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, పారిశ్రామికవేత్తల నుంచి కలెక్టరేట్‌లో శుక్రవారం స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్‌కోసం సలహాలు, సూచనలు స్వీకరించారు. జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళిక డాక్యుమెంటరీని తయారు చేసి ప్రభుత్వానికి అందించాల్సి ఉందన్నారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ పుంగనూరు, కుప్పం ప్రాంతాల్లో హార్టికల్చర్‌పై ఆధారపడి ఎక్కువ కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. వారికి ఉపాధి కోసం ఫుడ్‌ప్రాసెసింగ్ ఇండస్ట్రీని ఏర్పాటు చేయాలని చెప్పారు. డెయిరీ అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని, యూనివర్శిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. చిత్తూరుజిల్లాను విద్యా, వైద్య, పారిశ్రామికంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పలువురు సూచించారు. చిత్తూరు నగరాన్ని అభివృద్ధి చేసేందుకు టౌన్ డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటుచేయాలని సూచించారు. జేసీ విద్యాధరి, జడ్పీ సీఈవో రవి కుమార్ నాయుడు, హౌసింగ్ పీడీ పద్మనాభం, డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

వి.కోటలో భారీ వర్షం



వి.కోట, అక్టోబరు 4: వి.కోటలో మూడు రోజులుగా భారీ వర్షం కురుస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం చిరుజల్లులతో మొదలైన వాన క్రమేపీ పుంజుకుని సుమారు గంటపాటు ఎడతెరిపి లేకుండా కురిసింది. పట్టణ వీధులన్నీ జలమయమయ్యాయి. భారత్‌నగర్‌లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం 55 ఎం.ఎం., గురువారం 34 ఎం.ఎం., శుక్రవారం 24 ఎం.ఎంల వర్షపాతం నమోదైంది. వరుస వానలతో వేరుశనగ రైతులు ఒబ్బిడికి దిగారు.

సర్వేశాఖ ఏడీ బాధ్యతల స్వీకరణ



జయరాజ్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 4: జిల్లా సర్వే, భూరికార్డు శాఖ అడిషనల్ సెక్రటరీగా జయరాజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అన్నమయ్య జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన ఉద్యోగులతో సమావేశం అయ్యారు. జిల్లాలో సర్వేశాఖ కార్యక్రమాలపై సమీక్షించారు. సర్వేశాఖ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని ఆయన తెలిపారు.

సివిల్ సప్లయ్స్ డీఎం...



బాలకృష్ణ

పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా బి. బాలకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లాలోని జోనల్ కార్యాలయంలో పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

టెట్‌కు 445 మంది హాజరు

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 4: టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు (టెట్)-జూలై 2024 పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన పరీక్షలకు 445 మంది హాజరయ్యారు. జిల్లాలోని రెండు సెంటర్లు, చెన్నైలోని ఒక్క సెంటర్‌లో జరిగిన పరీక్షలకు 509 మంది అభ్యర్థులకు గాను 445 మంది హాజరుకాగా 64 మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 231 మంది అభ్యర్థులకు గాను 209 మంది హాజరుకాగా, 22 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 278 మంది అభ్యర్థులకు గాను 236 మంది హాజరు కాగా 42 మంది గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

నగరిలో గంజాయి స్వాధీనం.. ముగ్గురి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

నగరి, అక్టోబరు 4: మండలం పరిధిలో నాగరాజకుప్పం గ్రామానికి వెళ్లే దారిలో రైస్‌మిల్లు సమీపంలో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. నగరి సీఐ మహేశ్వర్ కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం అరక్కోణం పట్టణం తలగై పోలూరుకు చెందిన నరేంద్రన్ అలియాస్ గుణ(25), జ్యోతినగర్‌కు చెందిన హుస్సేన్(22), నగరి మండలం ఓజీకుప్పం గ్రామానికి చెందిన కే.హరీష్(21) నుంచి గంజాయి కొనుగోలు చేస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 1500 గ్రాముల గంజాయిని, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

నాటు తుపాకుల స్వాధీనం.. ఇద్దరి అరెస్టు



నిందితులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు





నిందితులు రమేష్, సోనమ్

యాదమరి, అక్టోబరు4: నాటు తుపాకులను స్వాధీనం చేసుకుని పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. ఎస్‌ఐ ఈశ్వర్ కథనం మేరకు.. మండలంలోని కోనాపల్లి గ్రామ సమీపంలోని కమ్మరాయని మిట్ట వద్ద శుక్రవారం ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని తనిఖీ చేయగా నాటు తుపాకులు ఉండడాన్ని గుర్తించారు. తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చిత్తూరు మండలం అనుప్పల్లికి చెందిన రమేష్ (32), యాదమరి మండలం కీనాటం పల్లె పంచాయితీ షికారి కాలనీకి చెందిన సోనమ్ (22)గా గుర్తించారు.

ఇష్టారాజ్యంగా గదుల అక్రమ నిర్మాణాలు

క్రమబద్ధీకరణకు తలలు పట్టుకొంటున్న మున్సిపల్ అధికారులు



సామూహిక మురుగుదొడ్లు కూల్చి నిర్మించిన గదులు, మురుగు కాలువ పక్కన నిర్మించిన గదుల సముదాయం, రాచకాలువపైనే నిర్మించిన గదులు

పలమనేరు, అక్టోబరు4 : వైసీపీ ప్రభుత్వ హయాంలో పలమనేరులో జరిగి అక్రమ నిర్మాణాలు ఒక్కొక్కటే వెలుగులోకి వస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన గదులు నేడు క్రమబద్ధీకరించడానికి అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న మున్సిపల్ షాపింగ్‌కు ఆనుకునే మురుగునీటి కాలువ (రాచకాలువ) వెళ్తోంది. ఈ కాలువకు ఆనుకొనే ఆర్టీసీ బస్టాండు స్థలం వుంది. రాచకాలువ ఉన్నందున ఆర్టీసీ అధికారులు మిన్నకుండిపోయారు. అయితే ఈ రాచకాలువపైనే షాపింగ్ గదుల నిర్మాణానికి మున్సిపల్ అధికారుల మద్దతుతో ప్రైవేటు వ్యక్తులు గదుల సముదాయం నిర్మించేందుకు పూనుకోవడంతో ఆర్టీసీ అధికారులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. అయినా గదుల నిర్మాణాలు చేపట్టడంతో బస్టాండు స్థలానికి ప్రహరీ నిర్మించారు. దీంతో ఈ గదులకు దారిలేని పరిస్థితి ఏర్పడడంతో ప్రైవేటు వ్యక్తులు రాచకాలువపైనే స్లాబ్ వేసి ఒక ఇరుకైన దారిని కూడా ఏర్పాటు చేసుకొన్నారు. అయితే ఈ గదుల సముదాయం కూడా నేడు వృథాగా పడివుంది. ఇలా పలుచోట్ల గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు వైసీపీ నేతలకు కట్టబెట్టిన 23 గదులు నేటికి ప్రారంభానికి నోచుకోలేదు. నిర్మాణాలు పూర్తయిన రెండు నెలలకే ఎన్నికల నోటిఫికేషన్ రావడం, అప్పటి మున్సిపల్ అధికారులు బదిలీపై వెళ్లిపోవడం జరిగింది. ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో గదులు నిర్మించుకున్న నేతలు మున్సిపల్ అధికారుల ద్వారా ఎలాగైనా గదుల క్రమబద్ధీకరణ చేసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఏమాత్రం నిబంధనలు పట్టించుకోకుండా జరిగిన అక్రమ నిర్మాణాలకు తాము క్రమబద్ధీకరణ చేస్తే ఇబ్బందులు వస్తాయని అధికారులు వారి అభ్యర్థనలను తోసి పుచ్చుతున్నారు. కలెక్టర్ స్పందించి ఈ గదుల అక్రమ నిర్మాణాలపై విచారణ చేపట్టి ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు అంటున్నారు. రాచకాలువలను పరిరక్షించాల్సిన అధికారులే రాజకాలువలపై అక్రమనిర్మాణాలను ప్రోత్సహించారని ఇక్కడి ప్రజలు విమర్శిస్తున్నారు.

టీటీడీ బోర్డు లేకుండానే బ్రహ్మోత్సవాలు

తిరుపతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి పాలకమండలి లేకుండానే అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. గురువారం అంకురార్పణ, శుక్రవారం ధ్వజారోహణం కూడా జరిగాయి. కనీసం స్పెసిఫైడ్ అథారిటీ కూడా లేదు. ఇటువంటి పరిస్థితి చాలా అరుదు. పాతికేళ్ళలో 2017లో మాత్రమే శ్రీవారి బ్రహ్మోత్సవాలు పాలకమండలిగానీ, స్పెసిఫైడ్ అథారిటీగానీ లేకుండానే జరిగాయి. మళ్లీ అలాంటి పరిస్థితి ఇప్పుడు ఏర్పడింది. టీటీడీ ఏర్పాటైనప్పటి నుంచీ నిర్వహణ కోసం నిర్ణీత కాలానికి ప్రభుత్వం పాలకమండళ్లను నియమిస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. పాలకమండలి లేని సమయాల్లో దేవస్థానాలకు సంబంధించిన కీలక నిర్ణయాల కోసం ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం స్పెసిఫైడ్ అథారిటీని నియమిస్తుంది. పాలకమండలిలో అధ్యక్షుడు, సభ్యులు వుంటే స్పెసిఫైడ్ అథారిటీలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గానూ, ఈవో, జేఈవోలు సభ్యులుగా వుంటారు. కార్యనిర్వహణాధికారిని కూడా ప్రభుత్వమే నియమిస్తున్నప్పటికీ ఆ అధికారికి పరిమిత అధికారాలు మాత్రమే వుంటాయి. పరిపాలనాపరంగా సాధారణ నిర్ణయాలను మాత్రమే ఈవో తీసుకోగలరు. కీలక అంశాలపై పాలకమండలిలోనే చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు. టీటీడీ ఏటా ఎన్నో ఉత్సవాలు, వేడుకలు నిర్వహిస్తుంటుంది. తిరుమలలోనే కాకుండా దేశవ్యాప్తంగా వున్న అనుబంధ ఆలయాల్లో కూడా వీటిని చేపడుతుంటుంది. అయితే అవన్నీ ఒకెత్తు అయితే శ్రీవారి బ్రహ్మోత్సవాలు మరొక ఎత్తు. ఈ ఉత్సవాలకు ఉన్న ప్రాధాన్యత, ప్రాచీనత మరే ఉత్సవానికీ ఉండదు. అయినా ఈసారి పాలకమండలి లేకుండానే బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాలకు ముందే టీటీడీ పాలకమండలిని ప్రకటిస్తారనే ప్రచారం జరిగింది. పలు పేర్లు కూడా ఊహాగానాల్లో తిరిగాయి. టీటీడీ చైర్మన్ పదవికి, మంత్రి పదవికి కూడా లేనంత పోటీ ఉంటుంది. చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలు అవుతున్నా పాలకమండలిని నియమించకపోవడం మీద రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

మరో ఫీల్డ్ అసిస్టెంట్ రాజీనామా



సామాజిక తనిఖీలో అవకతవకలపై చర్చిస్తున్న దృశ్యం

నగరి, అక్టోబరు 4: ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. మరో ఫీల్డ్ అసిస్టెంట్ స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. నగరి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉపాధి హామీ సామాజిక బహిరంగ సమావేశం నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సం బంధించి సెప్టెంబరు 23 తేదీ నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు పంచాయతీల వారీగా తనిఖీలు నిర్వహించారు. మండలంలో 8 కోట్ల 64 లక్షల రూపాయలు కూలీలకు చెల్లించగా రూ.22,500 అవినీతి జరిగిందని తేల్చారు. ధరణి పంచాయతీలో ఓ సంఘమిత్ర పేరుపై, పాఠశాలలో పనిచేసే స్వీపర్ పేరుతో మస్టర్లు వేసి రూ.25,674 పేమెంట్ చేసి అక్రమాలకు పాల్పడిన సౌరకాయలు అనే ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు. కాగా అక్రమాలకు సంబంధించి మాంగాడు ఫీల్డ్ అసిస్టెంట్ స్వచ్ఛందంగా రాజీనమా చేశారు. క్రిష్ణారామాపురంలో ఒకరి బదులు మరొకరితో పనిచేయించి రూ.68504 మస్టర్లు వేసి పేమెంట్ ఇచ్చారని దీనిపై విచారణ చేయాలని జిల్లా డ్వామా పీడీ ఉమావాణి తెలిపారు. పలు పంచాయతీల్లో జియో ట్యాగింగ్ ఫొటోలను క్షేత్ర సహాయకులు తీయకపోవడంతో రూ.14600 జరిమానా విధించారు. బొగ్గ అగ్రహారం పంచాయతీ పరిధిలో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శోభన్‌బాబు, ఎంపీడీవో సతీష్, ఏపీవో కవిత, ఎస్ఆర్పీ రవి, డీఆర్పీలు పాల్గొన్నారు.

ఎంబీయూలో అట్టహాసంగా మోహన మంత్ర



వేదికపై మంచు విష్ణు తదితరులు - విద్యార్థులతో కలిసి క్రీడల్లో పాల్గొన్న మోహన్‌బాబు - నృత్యం చేస్తున్న విద్యార్థినులు

చంద్రగిరి, అక్టోబరు 4: మండలంలోని ఎ.రంగంపేట సమీపంలో గల మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో మోహన మంత్ర కార్యక్రమం శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ఎంబీయూ ప్రో.ఛాన్సలర్ విష్ణు మంచు ప్రారంభించారు. ఛాన్సలర్ డాక్టర్ మోహన్ బాబు హాజరయ్యారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి 20 వేలమందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్నారు. మంచు విష్ణు మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని, వారి మేధస్సును, నైపుణ్యాన్ని వెలికితీయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. టెక్నోహాలిక్, కళాక్షేత్ర, స్పోర్ట్స్ ఈవెంట్స్‌లో విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. విద్యార్థులతో కలిసి మంచు విష్ణు డ్యాన్సు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎంబీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, వైస్ ఛాన్సలర్ ఆచార్య నాగరాజ రామరావ్, చీఫ్ గ్రోత్ స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సారథి, డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంగవైకల్యం అడ్డంకి కాకూడదు

కలెక్టర్ సుమిత్‌కుమార్



కృత్రిమకాళ్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు, అక్టోబరు 4: అంగ వైకల్యం శరీరానికే కానీ... మనస్సుకు కాదని, కాబట్టి అంగవైకల్యం కలిగిన వారందరూ అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అభిలషించారు.విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చిత్తూరు అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం కృత్రిమకాళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జగన్మోహన్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీడం ట్రస్ట్ సేవ్ అండ్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో 208మందికి రూ. 15వేల విలువ చేసే కృత్రిమకాళ్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ సేవా సంస్థలు కృత్రిమ కాళ్లను అమర్చడంతో పాటు ట్రైసైకిళ్లను అందించేందుకు ముందుకు రావాలని కోరారు.విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ శ్రీనివాస్, ట్రస్టు సభ్యులు సుదర్శన రెడ్డి, బీజేపీ ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బరువు కాదు... బాధ్యత



వికలాంగుడైన భర్త రామకృష్ణను మోసుకొస్తున్న మునిలక్ష్మి

కృత్రిమకాళ్ల పంపిణీ కార్యక్రమానికి పుంగనూరుకు చెందిన దంపతులు మునిలక్ష్మి, మల్లికార్జున హాజరయ్యారు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న ఆ కుటుంబంలో ఉన్నట్లుండి ప్రమాదంలో మల్లికార్జున రెండు కాళ్లనూ కోల్పోయాడు. ఒక పక్క వ్యవసాయం, మరోపక్క పిల్లల చదువులను చూసుకుంటూనే భర్తకు మునిలక్ష్మి సపర్యలు చేస్తోంది. భర్తకు సపర్యలు చేయడం బరువు కాదని... తన బాధ్యతని ఆమె చెప్పారు.

కుమారుడి చేతిలో తండ్రి హతం



మృతుడు వెంకటేశు

గుడుపల్లె, అక్టోబరు 4: డబ్బులు అడిగితే ఇవ్వని తండ్రిని కొడుకు కర్రతో కొట్టడంతో చనిపోయిన ఉదంతమిది. పోలీసుల కథనం మేరకు...గుడుపల్లె మండలం మిట్టూరుకు చెందిన వెంకటేశు (67) మద్యం సేవించి ఇంట్లో తరచూ గొడవ పడేవాడు. వెంకటేశు భార్య మంగమ్మ, కుమారుడు సోమశేఖర్ గ్రామ పెద్దల వద్ద పంచాయతీ నిర్వహించగా ఇకపై మద్యం సేవించనని వెంకటేశు చెప్పాడు. ఆ తరువాత కొన్ని రోజులకే వెంకటేశు మళ్లీ మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవ పడడం మొదలెట్టాడు.ఈ నేపథ్యంలో గురువారం రాత్రి వెంకటేశు మద్యం సేవించి ఇంటికి రాగా సోమశేఖర్ డబ్బులు కావాలని అడిగాడు అయితే డబ్బులు ఇవ్వనంటూ సోమశేఖర్‌తో వెంకటేశు ఘర్షణకు దిగాడు. దీంతో సోమశేఖర్ ఇంటి ఎదుట ఉన్న పెద్ద కర్రను తీసుకొని వెంకటేశు తలపై కొట్టడంతో కుప్పకూలిపోయాడు.108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా వెంకటేశును చూసిన సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు తేల్చారు.వెంకటేశు భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.పోస్టుమార్టం అనంతరం వెంకటేశు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక న్యాయమూర్తి



న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల (కాణిపాకం), అక్టోబరు 4: కాణిపాక వరసిద్ధుడిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేవీ.అరవింద్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాలతో ఆహ్వానించి స్వామి వారి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. అలాగే స్వామిని విజయవాడ సెంట్రల్ శాసన సభ్యుడు బోండా ఉమామహేశ్వరరావు, నందికొట్కూరు శాసనసభ్యుడు జయసూర్య స్వామిని వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేష్‌కుమార్, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ప్రవాస భారతీయులు

● ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు



చిత్తూరు సిటీ, అక్టోబరు 4: ఇజ్రాయెల్ - ఇరన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారతదేశానికి ఇంధనం కొరత ముప్పు పొంచి ఉందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. 80 శాతం చమురు గల్ఫ్ దేశాల నుంచ భారత్ దిగుమతి చేసుకుంటోందని గుర్తు చేశారు. ఇప్పటికే చమురు ధరల పెరుగుదలతో తీవ్రంగా దెబ్బతిన్న విమానయాన రంగం కూడా గణనీయమైన సవాళ్లను ఎదుర్కోవలసి వస్తుందని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్న 9 మిలియన్ల భారతీయ ప్రవాసుల భద్రత, జీవనోపాధి దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. వీరు ప్రతియేటా బిలియన్ల డాలర్ల చెల్లింపులను దేశానికి పంపుతుంటారని వారి కుటుంబాలకు కీలకమైన ఆర్థిక సాయానికి అడ్డంకులు ఏర్పడుతాయని తెలిపారు. ప్రస్తుత సవాళ్లను ఎదుర్కోవడానికి ఆర్థిక వ్యవస్థలను స్థిరీకరించడానికి భారత ప్రభుత్వం వేగంగా చర్యలు చేపట్టాలని ఆయన ఆప్రకటనలో కోరారు.

చికెన్ ప్రాసెసింగ్ యూనిట్ వద్దు



రైతులతో సమావేశమైన ఆర్డీవో శ్రీనివాసరాజు

గుడుపల్లె, అక్టోబరు 4: మండలంలోని పొగుపల్లె వద్ద చికెన్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయొద్దంటూ ఆ గ్రామస్తులు కొందరు అందుకు కేటాయించిన స్థలం వద్ద శుక్రవారం నిర్మాణ పనులను అడ్డుకున్నారు. పొగురుపల్లె గ్రామ పరిధిలో చికెన్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం 30 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. శుక్రవారం ఆ స్థలంలో ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులను ప్రారంభించారు. చికెన్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు వల్ల కాలుష్యం పెరిగి పరిసర గ్రామాల్లో ఉన్న పొలాల్లో పంటలు పండవని పలువురు రైతులు నిరసనకు దిగడానికి అక్కడికి చేరుకున్నారు. విషయం తెలుసుకొన్న రాళ్లబూదుగురు ఎస్‌ఐ సుమన్ అక్కడి చేరుకుని తహసీల్దారు కార్యలయానికి రావాలని, ఆర్డీవో వస్తారని రైతులకు తెలిపారు. గుడుపల్లె తహసీల్దారు కార్యాలయానికి చేరుకొన్న ఆర్డీవో శ్రీనివాసరాజు రైతులు, పలు రాజకీయ పార్టీ నేతలతో సమావేశమయ్యారు. చికెన్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు వల్ల పంటలకు ఎలాంటి నష్టం జరగదని, రైతులందరూ సహకరించాలని ఆర్డీవో కోరారు. చికెన్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు వల్ల మండలం అభివృద్ధి చెందడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలియజేశారు. అనంతరం రైతులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

తూర్పు నుంచి పశ్చిమానికి

పులిచెర్ల మండలాన్ని వీడని ఏనుగుల గుంపు ● ఆవులపెద్దిరెడ్డిగారిపల్లి వద్ద పంటల ధ్వంసం



ఆవలపెద్దిరెడ్డిగారిపల్లి వద్ద వరి పంటను ధ్వంసం చేసిన ఏనుగులు



తూర్పు అటవీప్రాంతంలో డ్రోన్ సాయంతో గుర్తించిన ఏనుగుల గుంపు

కల్లూరు, అక్టోబర్ 4 : తూర్పు, పశ్చిమ అటవీ ప్రాంతాలకు సరిహద్దులో పులిచెర్ల మండలం ఉండడంతో అటూ ఇటూ తిరుగుతున్న గజరాజులు పంటలను ధ్వంసం చేస్తూ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పది రోజుల క్రితం పశ్చిమ అటవీప్రాంతంలోని ఐరాల సెక్షన్ పరిధిలోని పాతపాళ్యం అడవి నుంచి పులిచెర్ల మండలంలోని పాతపేటలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు మూడు రోజుల పాటు అక్కడ పంటలను ధ్వంసం చేశాయి. అనంతరం తూర్పు అటవీప్రాంతంలోని మంగళంపేట సెక్షన్ పరిధిలో పాళెం, దేవళంపేట, కల్లూరు పంచాయతీల్లోకి చేరుకున్న ఏనుగుల గుంపు కొంగరవారిపల్లి, కోటపల్లి, జూపల్లి, తుడుంవారిపల్లి, వంకాయలపాటివారిపల్లి, పెనుబాల ఎస్సీ కాలనీ, కల్లూరు తదితర ప్రాంతాల్లోని పంటలను ధ్వంసం చేశాయి. రెండు రోజులుగా కోటపల్లి సమీపంలో టమోటా, వరి, మామిడి పంటలకు తీవ్ర నష్టం కలగజేయడంతో తూర్పు అటవీప్రాంతం ఎఫ్ఆర్వో థామస్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం డ్రోన్ సాయంతో ఏనుగుల గుంపు జాడను గుర్తించారు. గురువారం రాత్రి పశ్చిమ అటవీ ప్రాంతం మంగళంపేట సెక్షన్ నుంచి ఐరాల సెక్షన్ వైపు ఏనుగుల గుంపును తరలించారు. దీంతో తూర్పు అటవీప్రాంతంలోని ప్రజలు ఊపిరి పీల్చుకోగా పశ్చిమ అటవీప్రాంతంలోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బోడిరెడ్డిగారిపల్లి పంచాయతీ ఆవులపెద్దిరెడ్డిగారిపల్లి సమీపంలోని వరి పంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. గ్రామానికి చెందిన రైతులు రాజమ్మ, నాగరాజు, కోదండయ్య, ఆనంద్, లవకుమార్, వెంకట్రామయ్య, తిమ్మయ్యకు చెందిన వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.పశ్చిమ, తూర్పు అటవీ ప్రాంతాలకు సంబంధించిన అధికారులు సమన్వయంతో ప్రణాళికను రూపొందించి పలమనేరు కౌండిన్య అరణ్యంలోకి ఏనుగుల గుంపును తరలించాలని రైతులు కోరుతున్నారు.